# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 2 సంచిక - 15 పక్షపత్రిక ఆగస్టు 1-15, 2011

₹ 10/-




## లోక్‌సత్తా మున్సిపల్ శంఖారావం





శ్రీకాకుళం జిల్లాలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జేపీ



శ్రీకాకుళం జిల్లాలో రైతుల కోరిక మేరకు ఎద్దుల బండిపై జేపీ



శ్రీకాకుళం జిల్లాలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జేపీ



చిత్తూరు జిల్లాలో సి.పి.ఐ. అఖిలపక్ష సమావేశంలో జేపీ



చిత్తూరు జిల్లాలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జేపీ



చిత్తూరు జిల్లాలో సి.పి.ఐ. అఖిలపక్ష సమావేశంలో జేపీ



అనంతపురం జిల్లాలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జేపీ



జి.హెచ్.ఎం.సి. పరిధిలో బలమైన
లోక్‌పాల్ కోసం సంతకాల సేకరణ

జన రాజకీయం కోసం...
లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక ఆగస్టు 1-15, 2011
సంపుటి - 2 సంచిక - 15

## లోపలి పేజీల్లో...

స్థానిక పాలనతోనే మార్పు ....................... 5
గూర్ఖాలాండ్‌లో ప్రాదేశిక స్వయంపాలన ....... 7
గూర్ఖాలాండ్ ఉద్యమం - సంగ్రహ చరిత్ర ....... 9
భూసేకరణ, పరిహారం, పునరావాసాలకు ఒకే చట్టం...................... 11
చరిత్ర సంధి దశలో ఆంధ్రప్రదేశ్ ................. 13
బ్రతుకు పోరాటం ................................. 26
అవినీతి అంతు చూద్దాం మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం .................. 28
అవినీతి రహిత రాజకీయమే యువతకు లక్ష్యం కావాలి ........................29
ప్రభుత్వ విధానాలే అన్నదాతకు శాపాలు........ 31
జిల్లాలలో పార్టీ కార్యక్రమాలు..................... 32

సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# బలమైన లోక్‌పాల్‌ను సాధించాలి

## సంపాదకీయం

కేంద్ర కేబినెట్ లోక్‌పాల్ బిల్లును ఆమోదించింది. అన్నా హజారే బృందం తిరస్కరించింది. పార్లమెంటులో బిల్లుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 16 నుండి తిరిగి నిరాహార దీక్షను చేపడతానని అన్నా ప్రకటించారు. ఈ దీక్షకు అనుమతి ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇతర రాజకీయ పార్టీలు అన్నా బృందాన్ని సమర్ధిస్తున్నట్లు ప్రకటిస్తున్నా వివిధ అంశాల మీద భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయ సమీకరణకు ఉద్యమాలు సహజం. అయితే అంతిమంగా అవి చర్చల ద్వారానే పరిష్కారం కావాలి తప్ప మరో మార్గం లేదు. ఇలాంటి చర్చలు జరిపేవారు పరిష్కారాలు అన్వేషించడంలో హేతుబద్ధతనీ, విజ్ఞతనీ, పరిణతినీ ప్రదర్శించాలి. లేకపోతే ఏకాభిప్రాయం దిశగా సాగాల్సిన చర్చలు సిగపట్లతో ముగుస్తాయి. లోక్‌పాల్ చర్చలు అలాగే ముగిశాయి.

ఇటీవల గూర్ఖాలాండ్ సమస్యమీద ఒక ఒప్పందం కుదిరింది. గత మూడు దశాబ్దాలుగా ఆందోళనలు, ఉద్యమాలు, హింసాకాండతో సాగిన ఉద్యమం చివరికి చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని వదులుకునేది లేదని గూర్ఖా జనముక్తి మోర్చా స్పష్టం చేసింది. ఎవరి అభిప్రాయాలు వారు ఉంచుకుంటూనే ఒక మధ్యంతర ఒప్పందాన్ని వారు సాధించగలిగారు. ఈ పరిష్కారం ఫలితాలనిస్తే ప్రత్యేక రాష్ట్ర నినాదం సమసిపోవచ్చు లేదా వికటిస్తే ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారం కావచ్చు. దీనిని భవిష్యత్తుకు వదిలిపెట్టి అక్కడ ఏకాభిప్రాయాన్ని సాధ్యం చేసుకున్నారు. లోక్‌పాల్ మీద ఏకాభిప్రాయం అంతకంటే జటిలమైంది కాదు. కాని సాధ్యం కాలేదు.

ప్రభుత్వం పౌరసమాజం నుండి వస్తున్న కొన్ని హేతుబద్ధమైన వాదనలని అంగీకరించి తీరాలి. అందులో మొదటిది ఒకే చట్టంలో దేశానికి లోక్‌పాల్, రాష్ట్రాలకి లోకాయుక్త, స్థానిక ప్రభుత్వాలకు అంబుడ్స్‌మెన్ వ్యవస్థలను ఏర్పాటు చెయ్యడానికి ప్రభుత్వానికి అభ్యంతరాలుండకూడదు. గతంలో సమాచార హక్కు చట్టాన్ని ఇదే తరహాలో రూపొందించిన దృష్టాంతం వుంది. పోతే ప్రధానిని, పి.యం.ఓ ని లోక్‌పాల్ పరిధిలోకి తేవాలన్న అంశంమీద ఇరువైపుల వాదనలలోనూ కొంత పస వుంది. పి.యం.ఓను లోక్‌పాల్ పరిధిలోకి తేవాలి. ప్రధానిని కొన్ని మినహాయింపులతోనైనా తీసుకురావడానికి ప్రభుత్వం ముందుకు రావాలి. ఇలాంటి పట్టు విడుపుల ధోరణి ప్రభుత్వం ప్రదర్శించాలి.

అలాగే అన్నా బృందం కూడా న్యాయవ్యవస్థను లోక్‌పాల్ పరిధిలోకి తేవాలన్న వాదన కంటే దానిని ప్రత్యేక ఏర్పాటు చెయ్యాలన్న యోచనలోని హేతుబద్ధతను గుర్తించాలి. విజిల్‌బ్లోయర్స్ రక్షణకి ప్రత్యేక చట్టం తెస్తామన్నా ప్రభుత్వ ప్రతిపాదన కూడా ఆలోచించదగిందే. ఇలా ఏకాభిప్రాయ సాధనకు వున్న మార్గాలను అందరూ అన్వేషించాలి.

ఈ బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టినా స్టాండింగ్ కమిటీ ముందు అన్ని పార్టీలు, సంస్థలు చేసే సూచనల ఆధారంగా బలమైన లోక్‌పాల్ బిల్లును ఏకాభిప్రాయంతో సాధించడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. లేకపోతే లోక్‌పాల్ చట్టం తెచ్చామన్న ఘనత కంటే అవినీతి పరుల పక్షం వహించారన్న అపప్రధే ప్రభుత్వానికి దక్కుతుంది. ◆




*Indianink* సౌజన్యంతో...

# కార్టూన్ కార్నర్

**సెల్ ఫోన్ యుగంలో...**



Seyran - AZERBAIJAN

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
*ఇం.నం. 5–10–180/ఎ&ఎ1,*
*బ్యాండ్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,*
*హైదరాబాద్ – 500 004,*
*ఫోన్: 040–2323 1818*
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-2323 1818.***
*సెల్ : **80085 07934***

*విడి ప్రతి : రు. **10** ,*
*ఏడాది చందా : రు. **200***
*మూడేళ్ళ చందా : రు. **500***

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.




# స్థానిక పాలనతోనే 'మార్పు'

## మున్సిపల్ శంఖారావంలో జయప్రకాష్ నారాయణ్

***కొత్తదనాన్ని ఉత్తర కోస్తా ఆదరిస్తుందనేది ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ నానుడి. అయితే తాత్కాలిక ప్రలోభాలు, మాయలు లేకుండా నిర్మాణాత్మక కొత్త రాజకీయం కావటంతో లోక్‌సత్తా పార్టీకి ఎగిసిపడే ఆదరణ కాకుండా నిలకడగా ఉత్తర కోస్తా ప్రజల్లో మద్దతు పెరుగుతోంది. జులై 22, 23వ తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన పర్యటనలో ప్రజలు స్పందించిన తీరు, చూపిన విశేషాదరణ ఇందుకు అద్దంపడుతున్నాయి. 23వ తేదీన విజయనగరంలో జరిగిన మున్సిపల్ శంఖారావం కొత్త రాజకీయ సంస్కృతికి ప్రతీకగా ఎంతో స్ఫూర్తిదాయకంగా జరిగింది. డబ్బు, మద్యం పంచకుండా గ్రౌండ్ నిండిపోయేంతమంది తరలిరావటం ప్రధాన సాంప్రదాయపార్టీల నేతలనే ఆశ్చర్యపరిచింది. పెనం మీద నుంచి పొయ్యిలో పడుతూ శాశ్వత బిచ్చగాళ్లుగా మిగిలిపోకూడదంటే లోక్‌సత్తా ప్రత్యామ్నాయ రాజకీయాన్ని తెచ్చుకోవటమే మార్గమనే భావన ప్రజల్లో క్రమంగా పెరుగుతున్న సంకేతాలు కన్పించాయి.***

ప్రధానమంత్రి ఎవరవుతారో, ముఖ్యమంత్రిగా ఎవరుంటారో అనే చర్చలతో రాజకీయ పావులుగా మిగిలిపోకుండా స్థానిక ప్రభుత్వాలతో ఇంటి ముందుకు పాలనను తెచ్చుకుని ప్రజలు తమ బతుకుల్ని బాగు చేసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. రాజకీయం ప్రజల చుట్టూ తిరగాలి తప్ప ప్రజలు రాజకీయ పార్టీలు, నేతలు, వారి వారసుల చుట్టూ తిరగకూడదన్నారు. ప్రజల్ని ప్రభువులుగా చేసే రాజకీయంతో వచ్చిన లోక్‌సత్తా పార్టీ అందుకే స్థానిక ప్రభుత్వాల సాధికారత

కోసం పోరాడుతోందని, ఇంటి ముందుకు పాలన- కంటి ముందుకు ప్రభుత్వం తెచ్చి జనం చేతికి అధికారం ఇవ్వటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విజయనగరం కోట జంక్షన్‌లో జులై 23వ తేదీన లోక్‌సత్తా పార్టీ 'మున్సిపల్ శంఖారావం' సభలో జేపీ ప్రధాన ప్రసంగం చేశారు.

ప్రజలిచ్చిన అధికారాన్ని ప్రస్తుత పాలకులు దుర్వినియోగం చేస్తూ తమ కుటుంబాలను బాగు చేసుకుంటూ ప్రజల్ని బిచ్చ గాళ్లుగా మారుస్తున్నారని జేపీ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మారిన రాజకీయాల నేపథ్యంలో పార్టీల ఎత్తుగడల పుణ్యాన ప్రజలు బలిపశువులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్షాలు రెండేళ్లుగా రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్నాయన్నారు. దీనికంతటికీ రాజకీయ ప్రయోజనాలే కారణం తప్ప ప్రజాప్రయోజనాలు కావన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు తమ బతుకుల్లో ఏ మార్పులు వచ్చాయో ఆలోచించకుండా తప్ప పీఎంలు, సీఎంల ఎంపికల గురించి ఉత్కంఠగా చర్చించుకోవటం మూర్ఖత్వమవుతుందన్నారు. ఇటువంటి భావదాస్యం ఉన్నంతకాలం బడా రాజకీయ నాయకుల చేతిలో ప్రజలు బానిసలుగానే మిగిలిపోతారన్నారు. "బానిస బతుకుల నుంచి విముక్తి కావాలంటే స్థానిక పాలనకు ప్రజలు సిద్ధం కావాలి" అని జేపీ పిలుపునిచ్చారు.

స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు జరగనంత వరకూ గత 60 ఏళ్లుగా ఎలా ఉన్నామో భవిష్యత్తులోనూ అలాగే బతుకులీడుస్తామన్నారు. రాజకీయ నాయకులంటే ప్రజల బతుకులు బాగుచేసేందుకు కొవ్వొత్తిలా కరిగేవాడు కావాలితప్ప కోట్లకు పడగలెత్తే ఎత్తులుజిత్తులు వేసేవారు కాదన్నారు. రాజకీయాలంటే గుర్రపు పందెం కాదని, ప్రజల జీవితాల్ని బాగుచేయటమని గుర్తించాలన్నారు. ప్రజల ప్రయోజనాలను, జాతి ప్రయోజనాలను కాపాడటానికి, అవినీతిపరులను జైళ్లకు పంపేందుకు తన జీవితాన్ని పణంగా పెడతానన్నారు. రాష్ట్రంలోని ఖనిజసంపదను, ఇతర సహజవనరులను కొన్ని స్వార్థపర శక్తులు దోచుకుంటున్నాయని, వారిని తరిమివేసేందుకు ప్రజలు తమకున్న ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా 430కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాన్ని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశాయంటే ప్రభుత్వాలు ఎంత నిస్సిగ్గుగా పనిచేస్తున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. రాజకీయాల్లో కుల,మత, ప్రాంతాలకు అతీతంగా సమిష్టి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముందుకు నడవాలని, ఇందుకు స్థానిక ప్రభుత్వాలు వేదిక కావాలని కోరారు.

"జిల్లా ప్రభుత్వాలు ఏర్పాటు కావాలి. మున్సిపాలిటీలకు స్వయంప్రతిపత్తిని కల్పించటంతోపాటు వార్డులకు కేటాయించే నిధులు కూడా ప్రజల ద్వారానే వినియోగం జరిగేలా చేస్తేనే అభివృద్ధి సాధ్యం" అని జేపీ స్పష్టంచేశారు. ప్రజల్ని ప్రభువులుగా చేయటమే లక్ష్యంగా మున్సిపల్ శంఖారావాన్ని విజయనగరం నుంచి ప్రారంభించామని ప్రకటించారు. ఇప్పటికైనా యువత, మహిళలు, రైతులు తమలోని బిడియాన్ని వదిలి మెరుగైన సమాజం కోసం లోక్‌సత్తా పార్టీతో కలిసి నడవాలన్నారు. వారసత్వ రాజకీయాలు అంతమై, మరో పదేళ్లలో జనహిత రాజకీయం వస్తుందని జేపీ విశ్వాసం వ్యక్తం చేశారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వ పరిస్థితి 'కళ్లు కుర్చీ మీద, చెవులు ఢిల్లీ వైపు' ఉన్నాయన్నట్టుందన్నారు. రాష్ట్రంలో ప్రజల యోగక్షేమాల గురించి ఆలోచించే నాయకుడే కరువయ్యారన్నారు. కొత్త మున్సిపాలిటీలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారంటే ప్రస్తుత పాలకుల తీరుతో వారు ఎంతగా విసిగిపోయారో అర్థం చేసుకోవాలన్నారు. తమ చేతికి అధికారమిచ్చి పన్నులకు తగ్గ సేవలు అందించేలా ప్రజలు పాలకులను నిలదీసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. జిల్లాలో అధికార, ప్రతిపక్షం తేడాలేకుండా జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే అనేరీతిలో ఏకపక్ష పాలన సాగుతోందని విజయనగరం జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రతిపక్షంలోని వారు తమ పాత్ర మర్చిపోయి వ్యవహరిస్తున్నారన్నారు. కోట్లాది రూపాయల ఇసుక కుంభకోణం జరుగుతున్నా, జడ్పీలో ఏ రాజకీయ అధికారంలేని వ్యక్తి శాసించినా నిలదీయలేని దివాళాకోరు స్థితిలో ప్రతిపక్షం ఉందన్నారు. ప్రజలు ఈ వాస్తవాలను అర్థంచేసుకుని తమ జీవితాల్ని బాగు చేసే లోక్‌సత్తా కొత్త రాజకీయానికి అండగా నిలవాలన్నారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలు లేకపోయినా ఒక్క పిలుపుతో లోక్‌సత్తా మున్సిపల్ శంఖారావానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేసినందుకు ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ శంఖారావంలో మహిళాసత్తా నేత డి. మనోరమ, లోక్‌సత్తా విశాఖ జిల్లా అధ్యక్షుడు సురేష్, జిల్లా నాయకులు చింతలపూడి అప్పలరాజు, ఐ. అనంతలక్ష్మి, పాండ్రంకి వెంకటరమణ, దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ◆

# గూర్ఖాలాండ్‌లో ప్రాదేశిక స్వయం పాలన

రాష్ట్రంలో మినీ రాష్ట్రం



- స్వయంప్రతిపత్తితో సభ ఏర్పాటుకు త్రైపాక్షిక ఒప్పదం.
- సంతకం చేసిన కేంద్రం, బెంగాల్, జీజేఎం
- 45 మంది సభ్యులు, 6 నెలల్లో ఎన్నికలు
- 54 అంశాలపై విశేషాధికారాలు
- కేంద్రం నుంచి రూ॥600 కోట్లు

గూర్ఖాల్యాండ్ ప్రాదేశిక పాలన (జీటీఏ) ఏర్పాటుకు అంగీకరిస్తూ త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. మునపటి డీజీహెచ్‌సీ కంటే జీటీఏకు ఎక్కువ అధికారాలు సంక్రమించనున్నాయి. సిలిగురికి 8 కి.మీ దూరంలోని పింటైల్ గ్రామంలో కేంద్రహోం మంత్రి చిదంబరం బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, జీజేఎం అధినేత బిమల్ గురుంగ్ సమక్షంలో... బెంగాల్ హోంశాఖ కార్యదర్శి జి.డి.గౌతమ, కేంద్ర హోం మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి కె.కె.పాఠక్, జీజేఎం ప్రధాన కార్యదర్శి రోషన్‌గిరి 16 పేజీల ఒప్పందంపై సంతకాలు చేశారు. భాజపాకు చెందిన డార్జిలింగ్ ఎంపీ జశ్వంత్‌సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. అంతకు ముందు కేంద్ర రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సీసీపీఏ) జీటీఏ ఏర్పాటుకు ఆమోదం ప్రకటించింది. జీటీఏ ఒప్పందానికి సంబంధించిన చర్చలు గత నెల 7న కొలిక్కి వచ్చాయి.

ఒప్పందం సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ "ప్రజలతో సంబంధమున్న ప్రతి విభాగం మీ పరిధిలోకి తీసుకొచ్చాం. మీ ముందు సమున్నత లక్ష్యం ఉంది. బెంగాల్, కేంద్ర ప్రభుత్వాలు మీ వెన్నంటే ఉంటాయి. అడ్డంకులు చాలా ఉంటాయి. చర్చల ద్వారా దేన్నైనా పరిష్కరించుకోవచ్చు. ఈ ప్రాంతంలో భిన్న సంస్కృతుల వారున్నారు. ఈ భిన్నత్వాన్ని కొత్త యంత్రాంగం పరిరక్షించాలి. అని సూచించారు. జీజేఎంకు చెందిన వేల మంది మద్దతురార్లు కరతాళ ధ్వనుల మధ్య మమతాబెనర్జీ, బిమల్ గురుంగ్‌లను చిదంబరం ప్రశంసించారు. ప్రధాని మన్మోహన్ సింగ్ యూపీఏ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీల తరపున అభినందనలు తెలియజేశారు.

మమతా బెనర్జీ మాట్లాడుతూ బెంగాల్‌ను విభజించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గ్రేటర్ కూచ్‌బెహార్ డిమాండ్‌ను కూడా ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదన్నారు. జీటీఏను వ్యతిరేకిస్తున్న సీపీఎం, ఇతర ప్రాంతీయ సంస్థలను మమతాబెనర్జీ తీవ్రంగా విమర్శించారు. సమస్య పరిష్కారం కావడం వారికి ఇష్టం లేదన్నారు. వామపక్ష కూటమి అధ్యక్షుడు బిమన్‌బోస్ స్పందిస్తూ ఇంతటి సున్నితమైన అంశంపై ఏకపక్షంగా చర్చలు జరగడం, ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్ల సత్ఫలితాలు రావు అన్నారు.

ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఆమ్రా బెంగాలీ, జనజాగరణ్, జనచేతన, ఆదివాసీ వికాస్ పరిషత్‌లు తెరాయ్, దువార్స్ ప్రాంతాల్లో 48 గంటల బంద్ నిర్వహించాయి. ఈ ప్రాంతాలను కూడా జీటీఏ పరిధిలో చేర్చాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఉండడంతో ప్రస్తుతానికి చేర్చలేదు. గతంలో గూర్ఖాల్యాండ్ ఉద్యమంలో డీజీహెచ్‌సీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు సుభాష్ ఘీషింగ్ ఒప్పందానికి పూర్తిగా దూరంగా ఉన్నారు.

## ఒప్పందంలో పేర్కొన్న ముఖ్యాంశాలు

- ఈ ప్రాంతం పశ్చిమబెంగాల్‌లో అంతర్భాగంగానే ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలుమార్లు నొక్కి చెప్పాయి.
- సామాజిక, ఆర్థిక, విద్యా, సాంస్కృతిక, భాషాభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతం చేసేందదుకు, గూర్ఖాల సంప్రదాయాలను పరిరక్షించేందుకు స్వయంప్రతిపత్తితో

కూడిన స్వీయ పరిపాలన సంస్థను ఏర్పాటు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం.

◆ సిలిగురి, తెరాయ్, దువార్స్‌లోని మరికొన్ని ప్రాంతాలను కూడా జీటీఏ పరిధిలోకి చేర్చే విషయాన్ని పరిశీలించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. ఏర్పాటైన ఆరునెలల్లో ఇది నివేదిక సమర్పిస్తుంది.

◆ ఎన్నికైన జీటీఏను 'అసెంబ్లీ' అని పిలవాలని జీజేఎం కోరుతున్నా.. 'సభ' అని వ్యవహరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పించాయి. (అసెంబ్లీ' అని వ్యవహరిస్తే ప్రత్యేక రాష్ట్ర ఇచ్చేశారు. అన్న భావన కలుగుతుంది. దీన్ని పరిహరించడానికే 'సభ' అన్న పదాన్ని ప్రభుత్వాలు ఖరారు చేయించాయి.)

◆ జీటీఏకు స్పీకరు, డిప్యూటీ స్పీకరు నేతృత్వం వహించాలని జీజేఎం కోరగా.. ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ సభావ్యవహారాలు నడిపించాలని తుదకు నిర్ణయించారు.

◆ జీటీఏ పరిధిలో మూడంచెల పంచాయితీ వ్యవస్థ ఏర్పాటు చేస్తారు.

◆ జీజేఎం ఆందోళనలో పాలుపంచుకున్న వారిపై నమోదైన కేసులను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షిస్తుంది. హత్యా నేరం కేసులు మినహాయించి మిగతా కేసులను ఉప సంహరించుకుంటుంది.

◆ గూర్ఖాల్లో షెడ్యూల్ తెగల హోదా కల్పించే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుంది.

◆ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రులు, పర్యాటక, ఆతిథ్య మేనేజ్‌మెంట్ సంస్థలు, కేంద్ర విశ్వవిద్యాలయం, ఐటీ ప్రాజెక్టులు సహా 17 ప్రాజెక్టులను జీటీఏ చేపడుతుంది.

◆ కలింపాంగ్ నుంచి జీప్-లా మీదుగా టిబెట్ వరకు వాణిజ్య మార్గం పై సమీక్ష.

◆ జీటీఏ పరిధిలోని మైదాన ప్రాంతంలో కనీసం వెయ్యిఎకరాల్లో పారిశ్రామిక ప్రాంతం ఏర్పాటు.

◆ రక్షిత అటవీ ప్రాంతాలను జీటీఏకు బదిలీ చేసే విషయంలో కేంద్రంతో సంప్రదించి నిర్ణయం. రక్షిత ప్రతిపత్తి లేని అటవీ ప్రాంతాలు జీటీఏకు బదిలీ.

◆ ప్రస్తుతం ఉన్న చట్టాల కారణంగా... డీజీహెచ్‌సీలో పనిచేస్తున్న తాత్కాలిక, క్యాజువల్, రోజువారీ సిబ్బందిని క్రమబద్ధీకరించడం కుదరదు. 10 ఏళ్ల పాటు నిరంతరంగా పనిచేసిన వారి విషయంలో మాత్రం రాష్ట్ర ఆర్థిక విభాగం 2010, ఏప్రిల్ 23న జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం వ్యవహరించాలి.

## జీటీఏ నిర్మాణం, పనితీరు

◆ జీటీఏ అధికార పరిధిలోకి డార్జిలింగ్, కుర్సెయాంగ్ కలింపాంగ్ ప్రాంతాలు వస్తాయి.

◆ సభ్యులు 45 మంది. ఎన్నికల ద్వారా వీరిని నియమిస్తారు. మరో ఆరు నెలల్లో.. రాష్ట్రచట్టం ప్రకారం ఎన్నికలకు నోటిఫికేషన్. షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు, మైనార్టీ వర్గాల నుంచి మరో ఐదుగురిని గవర్నర్ నామనిర్దేశం ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, పురపాలకసంఘాల అధ్యక్షులు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉంటారు.

◆ **సభాకాలం ఐదేళ్లు.**

**ఎలాంటి అధికారాలు?**

◆ స్వయం ప్రతిపత్తి హోదా ఉన్నప్పటికీ బెంగాల్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. శాసన అధికారాలుండవు. పన్నులు విధించే అధికారం ఉండదు. స్థానిక పాలనకు సంబంధించి నియమ, నిబంధనలు రూపొందించుకోవచ్చు.

◆ ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు వంటి నిర్ణయాలను తీసుకోవచ్చు.

◆ భవిష్యనిధి, పింఛను, బీమా, కళాశాలల సర్వీసుకమిషన్, పాఠశాలల సర్వీసు కమిషన్ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చు.

◆ ఉపాధ్యాయులు, లెక్చరర్లు సహా గ్రూప్ 'బి', 'సి', 'డి' ఉద్యోగాల నియామక అధికారాలుంటాయి. గ్రూప్ 'ఎ' ఉద్యోగ నియామక అధికారాలుండవు.

◆ తేయాకు తోటలను పర్యవేక్షించే తౌజీ విభాగం, వ్యవసాయం, సాగునీరు, ఆహారం, పరిశ్రమలు, విద్య, మహిళాశిశు సంక్షేమం, జలవనరులు, భూమి, పురపాలక సంఘాలు, పంచాయితీలు, పట్టణాభివృద్ధి, ప్రజారోగ్యం, పర్యాటకం సహా 59 విభాగాలపై అధికారాలు. 1988లో ఏర్పాటైన డీజీహెచ్‌సీ పరిధిలో విభాగాలు 32 మాత్రమే.

## నిధులు ఎక్కడి నుంచి?

రాష్ట్ర ప్రభుత్వం సాధారణంగా కేటాయించే ప్రణాళికా నిధులకు తోడు ఈ ఏడాది నుంచి రూ॥200 కోట్ల చొప్పున మూడేళ్ళ పాటు రూ॥600 కోట్ల మంజూరుకు కేంద్రం అంగీకారం. ◆

# గూర్ఖాలాండ్ ఉద్యమం-సంగ్రహ చరిత్ర

గూర్ఖాలాండ్ ఉద్యమానికి 100 సంవత్సరాలు దాటిన చరిత్ర వుంది. ఇది అనేక మలుపులు తిరిగింది అనేక ఉద్యమాలు సాగాయి. సంఘర్షనలలో 12 వందల మంది ప్రాణాలు కోల్పోయాయి. దీర్ఘకాలిక బందులు, రాస్తారోకోలు, హింసాత్మక సంఘర్షణలు విస్తృతంగా సాగాయి. అంతిమంగా 2011 జూలై 18న రాష్ట్రంలో మినీ రాష్ట్రం ఏర్పాటుకు త్రైపాక్షిక ఒప్పదం కుదిరింది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరించేది లేదని స్పష్టం చేశాయి. అదే సమయంలో గూర్ఖాలాండ్ జన విముక్తి మోర్చా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను వదులుకోనని స్పష్టం చేసింది. ఇరు పక్షాలు ఎవరి వాదనల మీద వారు వుంటూనే ఒక ఒప్పందానికి రాగలిగారు. ప్రజల తక్షణ అభివృద్ధి సమస్యలకి ఒక పరిష్కారాన్ని ఒక రాజీ మార్గాన్ని కనుగొనే విజ్ఞతనీ పరిణతినీ ప్రదర్శించారు. గూర్ఖాలాండ్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అయితే కొన్ని సంస్థలు ఈ ఒప్పందాన్ని అమ్ముడు పోవడంగా విమర్శించాయి. ఒకపక్క బందులు జరుగుతున్నా ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నారు. ప్రజలను సంతృప్తిపరిచే ఒప్పందాలు తాత్కాలిక ఆటంకాలున్నా నిలదొక్కుకుంటామని గూర్ఖాప్రజలు రుజువు చేస్తున్నారు. ఈ ఉద్యమ సంగ్రహ చిత్రాన్ని చూద్దాం.

1907 :డార్జిలింగ్ ప్రాంతాన్ని ప్రత్యేక పాలనా యూనిట్‌గా విభజించాలని బ్రిటిష్ ప్రభుత్వానికి మొట్టమొదటిసారిగా హిల్‌పీపుల్స్ కౌన్సిల్ తరపున మెమోరాండం ఇచ్చారు.

1923 : డెహ్రా డూన్‌లో ఆలిండియా గూర్ఖాలీగ్ ఏర్పడింది.

**1938, ఆగస్టు 8 :** ఆల్‌ఇండియా గూర్ఖాలీగ్ అధ్యక్షుడు డి.యస్.గురాంగ్‌కు ఉత్తరం రాస్తూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ వారి డిమాండ్‌ను సమర్ధించారు.

1947 : డార్జిలింగ్ దాని పరిసర ప్రాంతాలలోని నేపాలీ జాతీయులకు స్వయం పాలనా అధికారం కోరుతూ రాజ్యాంగ నిర్ణాయక సభకు మెమోరాండం ఇచ్చారు.

1954 : రాష్ట్రాల పునర్విభజన కమిటీ ముందు డార్జిలింగ్ ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతం చెయ్యాలని ఆల్‌ఇండియా గూర్ఖాలీగ్ కోరింది.

1961 : పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నేపాలీ భాషను అధికార భాషగా గుర్తించింది.



సుభాష్ ఘీషింగ్



జ్యోతిబసు

**1988లో పరిమిత స్వయం ప్రతిపత్తి గల గూర్ఖాహిల్ కౌన్సిల్ ఒప్పందం**

1980 : సుభాష్ ఘీషింగ్ గూర్ఖానేషనల్ డిపరేషన్ ఫ్రంటుని ఏర్పాటు చేశారు. ఆల్‌ఇండియా గూర్ఖాలీగ్ చేస్తున్న శాంతియుత ప్రయత్నాల వల్ల ఫలితంలేదని ప్రకటించాడు. తన పార్టీలో భాగంగా గూర్ఖా వలంటీర్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఇది మిలిటెంట్ సంస్థ. సమ్మెలు, దాడులు చెయ్యడానికి దీనిని సాధనం చేశారు.

1981 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ చట్టబద్ధమైన స్వయం ప్రతిపత్తిగల సంస్థను కొండప్రాంతాలకు ఏర్పాటు చేయాలని తీర్మానించింది.

**1986 మార్చి 30 :** 10 వేల మంది నేపాలీలను మేఘాలయ నుండి బహిష్కరించారు. ఇది హింసకు దారితీసింది. అంతవరకు శాంతి యుతంగా వున్న గూర్ఖాలాండ్ ఉద్యమం హింసాత్మకం కావడానికి యీ ఘటనలు దారితీశాయి.

200 మంది పౌరులు 40 మంది భద్రతాదళాల సభ్యుల ఈ సంఘర్షణలలో మరణించారు. 1988 వరకు రెండు సంవత్సరాల పాటు హింసాత్మక దాడులు యధేచ్ఛగా సాగాయి.

సుభాష్ ఘీషింగ్‌కు గూర్ఖాలకు ప్రత్యేక మాతృభూమి కావాలన్నది నినాదం అయింది.

1986 : మే నెలలో డార్జిలింగ్ కాంగ్రెస్ కమిటీ డార్జిలింగ్ ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వాలని కోరింది.

1987 : ఉద్యమాల హోరు మొదలైంది. 40 రోజుల సార్వత్రిక సమ్మె జరిగింది. నేషనల్ హైవేను పూర్తిగా దిగ్బంధం చేశారు. సిక్కింకు వెళ్లాలంటే ఇదొక్కటే రహదారి.

1988 : ఉద్యమ సంఘర్షణలలో 30 మంది మరణించారు. 44 కంపెనీల పారామిలటరీని, 20 కంపెనీల రాష్ట్ర పోలీసులను వినియోగించారు. 150 కోట్ల ప్రభుత్వ ఆస్తికి నష్టం జరిగిందని అంచనా.

1988 : పరిమిత స్వయం ప్రతిపత్తిగల డార్జిలింగ్ గూర్ఖాహిల్ కౌన్సిల్ ఏర్పాటుకి సుభాష్ ఘీషింగ్‌తో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. ఘీషింగ్‌దానికి అధ్యక్షుడయ్యారు.

1992 : నేపాలీ భాషను ఎనిమిదవ షెడ్యూలులో కేంద్ర ప్రభుత్వం చేర్చింది.

1993 : ఘీషింగ్ పాలన వక్రమార్గంలో నడిచింది. కౌన్సిల్ ఎన్నికలలో ప్రతిపక్షాల అభ్యర్థులకు బెదిరించడం ప్రారంభం అయింది. అలాగే పాలన అంతా అవినీతిమయం చేశారు.

1996 : ఆల్‌ఇండియా గూర్ఖాలీగ్ ఆధ్వర్యంలో ఘీషింగ్ అవినీతి పాలనపై బంద్‌లు, రాస్తారోకోలు జరిగాయి.

2008 : బిమల్ గురాంగ్ నాయకత్వంలో గూర్ఖాజన ముక్తి మోర్చా ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్రం కోసం పూర్తిగా హింసా మార్గాన్ని అనుసరించింది. ఘీషింగ్‌ను గూర్ఖా ద్రోహిగా ప్రకటించి ప్రజల మద్దతును కూడగట్టింది.

**2008 మే-జూన్ :** బంద్‌లు, ర్యాలీలు, రోడ్ల దిగ్బంధం, ప్రభుత్వ ఆఫీసుల ఆక్రమణ, గూర్ఖాలాండ్ రాష్ట్రంగా పేర్లు మార్చడం వంటి ఉద్యమాలను గూర్ఖాజనముక్తి మోర్చా నిర్వహించింది. డార్జిలింగ్ మైదాన ప్రాంత ప్రజలతో తీవ్ర సంఘర్షణలు జరిగాయి.

**2008 జూలై :** గూర్ఖాప్రజలలో పెల్లుబికిన అసంతృప్తి జ్వాలలతో పాటుగా జి.జె.యం కార్యకర్తని ఘీషింగ్ పార్టీ కార్యకర్త హత్యచెయ్యడంతో సుభాష్ ఘీషింగ్ హిల్ కౌన్సిల్ అధ్యక్ష పదవిని వదులుకుని సిలిగురికి మకాం మార్చాల్సివచ్చింది.

2009 : గూర్ఖా జనముక్తి మోర్చా తన స్వంత పోలీసుదళాన్ని గూర్ఖాలాండ్ పర్సనల్ పేరుతో ఏర్పాటు చేసింది. వీరు బంద్‌లు హింసాత్మక దాడులలో పాత్రదారులుగా ఉన్నారు.

**2010 మార్చి :** జి.జె.యం ఆమరణ నిరహార దీక్షలు, ఆత్మబలిదానాల కార్యక్రమాలను ప్రకటించింది. తీవ్రస్థాయి నిరసన కార్యక్రమాలు జరపడానికి సన్నాహాలు ప్రారంభించింది.



మమతా బెనర్జీ        బిమల్ గురాంగ్

**2011లో గూర్ఖాలాండ్ ప్రాదేశిక స్వయంపాలన ఒప్పందం**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో త్రైపాక్షిక చర్చలు ప్రారంభం అయ్యాయి.

**2010 జూలై 2 :** జి.జె.యంకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలకీ మధ్య త్రైపాక్షిక చర్చలు విచ్ఛిన్నం అయ్యాయి.

**2010 అగస్టు :** తిరిగి పశ్చి బెంగాల్ ప్రభుత్వానికి, జి.జె.యంకి మధ్య త్రైపాక్షిక చర్చలు జరిగాయి.

2011 : మేలో బెంగాల్‌లో మమతా బెనర్జి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాత చర్చలు ఊపు అందుకున్నాయి. ఒప్పందం కుదిరింది.

**2011 జూలై 18 :** గూర్యాలాండ్ ప్రాదేశిక స్వయంపాలనకు ఒప్పదంపై సంతకాలు చేశారు. ◆

# భూసేకరణ, పరిహారం, పునరావాసాలకు ఒకే చట్టం

## కేంద్రం రూపొందించిన బిల్లులో కొన్ని ముఖ్యాంశాలు

భూసేకరణపై దేశవ్యాప్తంగా ఇప్పటికే తీవ్ర అసంతృప్తి నెలకొంది. పైగా ఈ భూసేకరణం కారణంగా ఉపాధి కోల్పోయేవారి పునరావాసం గురించి ప్రస్తుతం ఎలాంటి చట్టాలూ లేవు. భూసేకరణలకు ఇప్పటికీ. బోలెడు సవరణలు చేసినా, కాలం చెల్లిన 1894 నాటి చట్టమే దిక్కుగా ఉంది.

భూసేకరణను-పరిహారం, పునరావాసం వ్యవహారాలన్నింటికి వర్తించేలా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించింది.

ఇందులో ప్రజా ప్రయోజనాల కోసం ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం భూమిని సేకరించి పెట్టొచ్చుగానీ.. భూమిని కోల్పోయే రైతుల్లో 80 శాతం కుటుంబాలు అందుకు ఆమోదం తర్వాతే భూసేకరణ చెయ్యాలి. ఇందులో 1894 భూసేకరణ చట్టానికి కొన్ని మార్పులు కూడా సూచించారు.

ప్రభుత్వం తన సొంత అవసరాల కోసం భూమిని సేకరించి తన ఆధీనంలో ఉంచుకోవచ్చు. అంతే తప్ప నిర్ణీత గడువులోగా ప్రైవేటు సంస్థలకు మాత్రం బదలాయించటానికి లేదు.

భూ సేకరణ, పునరావాసం, పరిహారాల కోసం కేంద్రం రూపొందించిన ముసాయిదా బిల్లులో కొన్ని ముఖ్యాంశాలు...

### భూమికి సమగ్ర పరిహార ప్యాకేజీ

- భూమికి మార్కెట్ విలువ నిర్ణయించాలి. ఇది బేసిక్ ధరకు 3 రేట్లు లేదా గత మూడేళ్లలో జరిగిన లావాదేవీల్లో అత్యధిక విక్రయ ధర. ఏది ఎక్కువైతే దానిని పరిగణలోకి తీసుకోవాలి.
- భూమిలో ఉన్న భవనాలు, చెట్లు, బావులు, పంటలు మొదలైన వాటికి సంబంధిత ప్రభుత్వ సంస్థచే విలువ నిర్ధారణ చేయించాలి.
- పై రెండిటినీ కలపగా వచ్చేది మొత్తం విలువ. దీనికి రెట్టింపు మొత్తాన్ని (100%) పరిహారంగా చెల్లించాలి. ప్రస్తుతం 30% మాత్రమే అధికంగా ఇస్తున్నారు.
- రైతు నుంచి భూమి తీసుకొని తర్వాత 10 ఏళ్లలో ఎప్పుడైన వేరే వాళ్లకు అధిక ధరకు విక్రయిస్తే ఆ పెరిగిన ధరలో 20% ఇవ్వాలి.
- కుటుంబానికి ఏడాదికి రూ॥2 వేల చొప్పున 20 ఏళ్ల పాటు ఇవ్వాలి. ద్రవ్యోల్బణాన్ని బట్టి ఆ పెరుగుదల దీనికీ వర్తింపజెయ్యాలి.
- మరిహారంలో 25% వరకూ షేర్లు తీసుకునే వెసులుబాటు ఉండాలి.



### భూమి కోల్పోయిన వారికి సమగ్రపునరావాసం ప్యాకేజ్

- జీవనోపాధి కోల్పోతే వారికి నెలకు రూ॥2 వేల చొప్పు ఏడాదిపాటు ఉపాధి అలవెన్సు చెల్లించడం.
- ఇల్లు కోల్పోతే గ్రామీణ ప్రాంతాల్లో 100చ.మీ, పట్టణ ప్రాంతాల్లో 50 చ.మీ.లలో ఇంటిని నిర్మించి ఇవ్వాలి.
- ప్రతి ప్రాజెక్టులోనూ ఒక్కో ఎస్టీ కుటుంబానికి ఎకరా భూమి.
- రవాణా కోసం రూ॥50 వేలు.
- షెడ్యూలు గ్రామాల నుంచి ఎస్సీ కుటుంబాలను రీసెటిల్ చేస్తే కుటుంబానికి రూ॥50 వేల చొప్పున ఇవ్వాలి.

◆ గృహ నిర్మాణం కోసం భూసేకరణ జరిపితే.. పరిహారానికి బదులుగా.. అభివృద్ధి చేసిన భూమిలో 20 శాతంలో...రైతు నష్టపోయిన దామాషా మేరకు వాటా ఇవ్వాలి.

◆ ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి తప్పనిసరిగా ఉద్యోగం కల్పించడం.

## భూమి లేకుండా, జీవనోపాధి కోల్పోయిన వారికి పునరావాసం ప్యాకేజీ

◆ భూ సేకరణ కారణంగా జీవనోపాధి కోల్పోతే నెలకు రూ॥2 వేల చొప్పున ఏడాది పాటు ఉపాధి అలెన్సు, ప్రస్తుతం 240 వ్యవసాయ పని దినాలకు వచ్చే మొత్తం మాత్రమే ఇస్తున్నారు.

◆ కుటుంబానికి నెలకు రూ॥2 వేల చొప్పున 20 ఏళ్ల పాటు చెల్లించడం. ద్రవ్యోల్బణం ఆధారంగా పెరుగుదల వర్తిస్తుంది. అంటే ప్రతి కుటుంబానికి ప్రతినెలా ఈ మొత్తం వచ్చేలా ఎల్ఐసీ వంటి సంస్థల్లో ప్రభుత్వం డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిరాదరణకు గురైన వారికి నెలకు రూ॥500, జీవితాంతం ఇచ్చే విధానం అమల్లో ఉంది.

◆ గృహవసతి లేని వారికి గ్రామాల్లో 100 చ.మీ, పట్టణాల్లో 50 చ.మీ స్థలంలో ఇంటిని నిర్మించి ఇవ్వాలి.

◆ పునరావాస అలవెన్సుగా ఒక్క దఫా రూ॥50 వేలు ఇవ్వాలి.

◆ రవాణాకు రూ॥50 వేలు. ఎస్టీ కుటుంబాలు షెడ్యూలు గ్రామాల నుంచి బయటకు వస్తే అదనంగా మరో రూ॥50 వేలు ఇవ్వడం.

◆ నిర్వాసిత కుటుంబాల్లో కుటుంబానికి ఒకరికి చొప్పున ఉపాధి.

## భూసేకరణ ఇలా జరగాలి

◆ సంబంధిత సంస్థ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాలి. దాని సామాజిక ప్రభావంపై అధ్యయనం జరగాలి. ప్రజా అవసరాలు, ప్రజాప్రయోజనాల కోసం అన్నదాని పైన, సామాజిక అధ్యయన నివేదికపైన ఉన్నతస్థాయి కమిటీ సమీక్షించాలి. ప్రత్యామ్నాయ స్థలాలపై జిల్లా కలెక్టర్ నివేదిక ఇవ్వాలి. ఇదంతా నోటిఫికేషన్‌కు ముందు జరగాలి.

◆ భూ సేకరణకు ప్రాథమిక ప్రకటన జారీ చేయాలి. ప్రజా విచారణ జరగాలి. భూసేకరణ ప్రాథమిక ప్రకటన జారీ చేసిన 6 నెలల్లోగా పునరావాస పథకాన్ని ఖరారు చేయాలి.

## సంస్థాగత చర్యలు

◆ కేంద్రప్రాజెక్టుల వివాద పరిష్కారాలకు జాతీయ భూసేకరణ, పునరావాస వివాద పరిష్కార అథార్టీ, రాష్ట్ర స్థాయి ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయిలోనూ ఇలాంటి అథార్టీ ఏర్పాటు చెయ్యాలి.

◆ ప్రాజెక్టులు ప్రజా ప్రయోజనం కోసమా? కాదా? అన్నది నిర్ధరించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ. భూసేకరణ పునరావాసం కోసం రాష్ట్రస్థాయి కమిషనర్.

◆ జిల్లా స్థాయిలో అమలు, పర్యవేక్షణ బాధ్యత జిల్లా కలెక్టర్‌ది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, సివిల్ సొసైటి, ఇతర ప్రాధాన్యత గల సంస్థలతో జిల్లా స్థాయిలో పునరావాస కమిటీ.

## విచ్చల విడిగా భూసేకరణ చేయకుండా జాగ్రత్తలు

◆ 100 ఎకరాలకంటే ఎక్కువ సేకరిస్తే సామాజిక ప్రభావం అధ్యయనం తప్పనిసరి. ప్రజా ప్రయోజనం ఎంత వరకూ ఉందన్నది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ సమీక్షించాలి.

◆ ప్రైవేటు కంపెనీల ప్రైవేటు అవసరాల కోసం. ప్రభుత్వం భూమిని భూమిని సేకరించిపెట్టదు.

## భూమి తిరిగి ఇవ్వడం

◆ ఏ ప్రయోజనం కోసమైతే సేకరించారో అందుకోసం ఐదేళ్లలో వినియోగించకపోతే భూమిని వెనక్కు ఇవ్వాలి. ఇందుకు రైతుల నుంచి ధర ఏమీ తీసుకోకూడదు. అయితే ప్రభుత్వంలోని ఒక శాఖ భూసేకరణ చేస్తే ఇంకో శాఖ అవకసరాల కోసం వినియోగించుకోవచ్చు.

## అపరాధం

◆ తప్పుడు సమాచారం ఇచ్చినా, దురుద్దేశంతో చేసినా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. తప్పుడు పత్రాలు ఇస్తే లక్ష రూపాయల వరకు జరిమానా, లేక జరిమానాతో పాటు నెల రోజుల జైలుశిక్ష. తప్పుడు సమాచారంతో పునరావాస ప్రయోజనాలు పొందితే ఆ మొత్తం తిరిగా వసూలు చేస్తారు.

## అత్యవసరం ఎప్పుడంటే

◆ దేశ భద్రత, రక్షణ అవసరాల కోసం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి బాధితులకు పునరావాసం కల్పించాల్సి వచ్చినప్పుడు, అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే అత్యవసర భూసేకరణ నిబంధనను వినియోగించాల్సి ఉంటుంది. ◆

# చారిత్రక సంధి దశలో ఆంధ్రప్రదేశ్

- "ఏ సమాజంలో అయితే నీతి తప్పిన వారు విజయం సాధిస్తారో
- ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారతారో
- ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో
- ఎక్కడైతే అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా
- తమకు 'కావలసిన వాటా' కోసం ప్రజలు అర్రులు చాస్తుంటారో
- అక్కడ వ్యవస్థకు సంబంధించిన పునస్సమీక్షకు సమయం ఆసన్నమైందని అర్థం.
- అప్పుడు తమ గురించి, తమకు సంబంధించిన వారి గురించి,
- తమ చుట్టూరా ఉన్నవారి గురించి, తమ కార్యకలాపాలకు సంబంధించి
- అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"

... అని సామాజిక శాస్త్రవేత్త క్లిట్‌గార్డ్ చెప్పిన మాటలు ఈవేళ 2011 పూర్వార్థంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్షరాలా అతికినట్టు సరిపోతాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం సరిగ్గా ఇదే సంధి దశ నడుస్తోంది. ఇది కేవలం ఇప్పటికిప్పుడు చోటుచేసుకున్న పరిస్థితి కాదు. వరుస ప్రభుత్వాలు, పాలకులు అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా, రాజకీయ సంస్కృతి ఈ పరిస్థితికి దారితీశాయి. అయితే నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆ పరిస్థితికి కొన్ని తక్షణ, అనూహ్య ఘటనలు గాలిలా తోడవటంతో మంటలు రాజుకున్నాయి. ఇన్నాళ్లూ మేడిపండు చందంగా ఉన్న అభివృద్ధి బట్టబయలై కుళ్లంతా బైటికి ఏరులై పారుతోంది. ప్రజల్ని రోజూ తాయిలాల కోసం ఎదురుచూసే బిచ్చగాళ్లుగా కొనసాగిస్తూ, వనరుల్ని దోపిడీకి, ఆశ్రిత పక్షపాతంతో విచ్చలవిడి పందేరానికి వినియోగిస్తూ రాష్ట్ర అభివృద్ధి అవకాశాలను ప్రశ్నార్థకం చేయటంతో ఈవేళ ఆ పరిణామాలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. మౌలిక సమస్యల్ని పరిష్కరించకుండా మురగబెడుతూ రాజకీయ లబ్ధి కోసం, తమ కుటుంబాల అభివృద్ధి కోసం, ప్రజల మనోభావాలతో జూదమాడుతుండటం వల్ల పరిస్థితులు విషమించే దాకా వచ్చింది. రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న యువత 21వ శతాబ్దపు అవకాశాల్ని అందుకుని దూసుకెళ్లాలని ఆరాటపడుతుంటే మన రాజకీయ వ్యవస్థ మాత్రం 19వ శతాబ్దపు తీరులోనే సాగుతూ ప్రజల ఆశల్ని చిదివేస్తోంది. వారిని తాత్కాలిక ప్రలోభాల మత్తులో జోకొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆవగింజంత అభివృద్ధి-తాటికాయంత అవినీతితో ప్రజల్ని చిచ్చుకొడుతున్నా ఆ దుష్పరిణామాలు ఎక్కడికీ పోవు. ఇవ్వాళ్టిలాగా నాయకత్వ వైఫల్యం, కొన్ని అనూహ్య సవాళ్లు వచ్చినప్పుడు బైటపడేందుకు మార్గం వెదుకుతుంటాయి.



డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న అస్థిరతను, అనిశ్చితిని, ఇతర ఆందోళనకర పరిస్థితులను బైటపడుతున్న కుళ్లుకు సంకేతంగానే చూడాలి. అయితే ఈ సంక్షోభాన్ని మంచి మార్పు కోసం ఒక మెరుగైన అవకాశంగా మలచుకోవటానికి అందరం అంతర్ముఖులమై లోపాల్ని వాస్తవికంగా విశ్లేషించుకోవాలి. ఇందులో వ్యక్తులు, పార్టీలు అప్రస్తుతం. ఈ రాష్ట్రం, దేశం

ప్రయోజనాలతో ముడిపడిన మౌలికాంశాలపై అందరూ ఒకే తాటి మీద నిలబడటం మొదలవ్వాలి. ఆ పరిధిలో ఎవరికి నచ్చినరీతిలో వాళ్లు కార్యక్రమాల్ని చేసుకోవచ్చు.

వ్యవస్థ పునస్సమీక్ష, ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణం, కొత్త అభివృద్ధి నమూనా ఆంధ్రప్రదేశ్‌కు ఈవేళ చారిత్రక అవసరం. అందుకోసం ఈ సంధిదశలో రాజకీయాలకతీతంగా, నిష్పాక్షికంగా లోపాల్ని విశ్లేషించుకుని, తగిన కార్యాచరణతో అందరూ కదలాల్సివుంది. అలా బాధ్యతతో వ్యవహరించటమే రాష్ట్ర, దేశ, అంతిమంగా మనందరి భవిష్యత్తుకు భరోసా.

ముందుగా ఎ) ఆంధ్రప్రదేశ్‌లోని సంక్షోభానికి మూలాల్ని పరిశీలిద్దాం. ఆ తర్వాత బి) నివురుగప్పిన ఆ నిప్పును రాజేసిన తక్షణ కారణాల్ని, ఘటనల్ని చూద్దాం.

## ఎ) ఆంధ్రప్రదేశ్‌లోని సంక్షోభానికి మూల కారణాలు...

ఇందులో 1. విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, అధికార వికేంద్రీకరణ లేకుండా పేదరికాన్ని కొనసాగించే విధానాలు 2. రైతు వ్యతిరేక విధానాలు 3. విశృంఖల అవినీతి 4. చట్టబద్ధ పాలన కొరవడటం ప్రధానమైనవి.

### 1. పేదరికాన్ని నిరంతరం కొనసాగించే విధానాలు

ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలు తాత్కాలికంగా అప్పగించే అధికారాన్ని ధర్మకర్తల్లా వినియోగించి, వారు కట్టే పన్నుల డబ్బును సద్వినియోగం చేసి, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ అందరికీ ఎదిగే అవకాశాల్ని కల్పించాలనే మౌలిక బాధ్యతను మన రాష్ట్ర పాలకులు విస్మరించారు. ప్రజల్ని ప్రభువులుగా కాకుండా పావులుగా మార్చి ఓట్ల కోసం ఉపయోగించుకునే విధానాల్ని ప్రారంభించారు. అందుకోసం ప్రజల్ని వారి కాళ్ల మీద వారు నిలబడకుండా పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే పద్ధతుల్ని అనుసరించారు. నిరుపేదలుగా ఉన్న కొంతమంది ప్రజలకు తప్పనిసరిగా ఇవ్వాల్సిన ఉచితాల్ని, రాయితీల్ని దాదాపు అందరికీ వర్తింపచేస్తూ, వాటిని నిరంతరం కొనసాగించటాన్ని రాజకీయ సంస్కృతిగా మార్చివేశారు. సంక్షేమం పేరుతో జనాకర్షక పథకాల్ని అమలుచేస్తూ చివరకు ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకపోతే ఓటు వేయటం, ఓటు వేయటానికి రావటం కూడా కష్టమనే స్థాయికి ప్రజలకు ప్రలోభాల్ని అలవాటు చేశారు. జనంలో చైతన్యం పెరిగి వారు తిరగబడకుండా, జీవచ్ఛవాల్లా, ఓటు వేసే యంత్రాలుగా మాత్రమే మిగిలేలా చేశారు. ప్రజలు కష్టపడి పనిచేసి తాము చేసే పని ద్వారా లాభాలు సంపాదించుకుని తలెత్తుకుని బతికే అభివృద్ధి నమూనాను పూర్తిగా విస్మరించారు. జనాకర్షక పథకాల మీద ఎక్కడా సమీక్ష లేదు. ఎప్పుడో 1980లలో కిలో రెండు రూపాయల బియ్యం పథకం అమలు ప్రారంభించినా ఈరోజుకూ చౌకబియ్యం, ఉచితాల కోసం అర్రులు జాచే ప్రజల సంఖ్య ఎందుకు పెరుగుతోంది? కేవలం తెల్ల రేషన్ కార్డుల కోసం లక్షలమంది ప్రజలు ఎందుకు ఎగబడుతున్నారు? రాష్ట్ర జనాభా ఎనిమిదిన్నర కోట్లు ఉంటే, తెల్ల రేషన్ కార్డులు రెండుకోట్ల నాలుగులక్షల కుటుంబాలకి ఎందుకున్నాయి? మరో 35లక్షల కుటుంబాలు తెల్ల కార్డులకి అర్హత ఉన్న తమకవి అందలేదని ఇటీవల 'రచ్చబండ' కార్యక్రమంలో ఎందుకు ధరఖాస్తుల్ని పెట్టుకోవలసి వచ్చింది ? ప్రస్తుతమిస్తున్న రాయితీల వల్ల ఫలితాలు లేవు కాబట్టి రాయితీల్ని ఏయే రంగాల్లో ఏయే సేవలకు ప్రకటిస్తే పేదరికం శాశ్వతంగా తొలగిపోతుంది? అనే విశ్లేషణ లేదు. పేదరికాన్ని రూపుమాపకుండా ఎలాగైనా శాశ్వతంగా కొనసాగించటమే ధ్యేయంగా పాలకులు పోటాపోటీ జనాకర్షక రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఇది రాష్ట్రం మీద తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపించింది.

జనాకర్షక రాజకీయాల మీద ప్రజలు తిరగబడకుండా పాలనను పూర్తిగా గుప్పెట్లో ఉంచుకునేందుకు పాలకులు కేంద్రీకృత పాలనావ్యవస్థను అమలు చేశారు. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ (సి.ఎం, డి.ఎం) ను దాటి అధికారాలు దిగువకు నామమాత్రం చేశారు. దీంతో కొద్దిమంది నేతలు, వారి బంధుమిత్ర సపరివారానికి పుష్కలంగా అభివృద్ధి అవకాశాలు వచ్చాయి. పట్టణీకరణ వేగవంతమైంది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానిలో మితిమీరిన స్థాయిలో అభివృద్ధి కేంద్రీకృతమైంది. మరోపక్క పల్లెల్లో ఉపాధి కరవై ఎటువంటి నైపుణ్యాలు లేకుండా పట్టణాలకు, ముఖ్యంగా రాజధానికి వలస వచ్చేవారి సంఖ్య విపరీతమైంది. చాలీచాలని గదుల్లో ముడుచుకుపోయే బతుకులతో వీరు సర్దుకుపోతున్నారు. దీనివల్ల పేదరికం శాశ్వతమైపోతూ మెజారిటీ ప్రజలు పూర్తిగా ప్రభుత్వం విదిల్చే తాయిలాల కోసం ఎదురుచూసేవారుగా మిగిలిపోయారు. మరోపక్క కొందరు మరింత సంపన్నులై పోయే ప్రక్రియ

కొనసాగుతూ ఆర్థిక అంతరాలు తీవ్రమవుతున్నాయి. ఈవేళ రాష్ట్రంలో నెలకొన్న అనిశ్చితికి, అశాంతికి ప్రధాన కారణాల్లో పేదరికాన్ని కొనసాగిస్తున్న పాలకుల తీరు ఒకటి. ఆకలితో వున్న వ్యక్తి తన మాంసాన్ని తానే తింటే ఎంత ప్రమాదకరమో అదేరీతిలో వ్యవస్థను దెబ్బతీసే ధోరణిలో సాగారు.

గత కొన్నేళ్లుగా ఆదాయం పెరిగినా, ఆహారధాన్యాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నా మానవాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాలన్నిటిలోకీ వెనకబడి ఉండటమే పేదరికాన్ని మన పాలకులు నేరసమాన తప్పుడు విధానాలతో శాశ్వతంగా కొనసాగిస్తున్నారటానికి తిరుగులేని సాక్ష్యం. అక్షరజానంలో 2011 జనాబా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ మన దేశంలో అట్టడుగున ఉన్న జార్కండ్ బీహార్ రాష్ట్రాల సరసన ఉంది. పేదరికం పోవాలంటే, ఆర్థిక అసమానతల్ని తొలగించాలంటే మానవ వనరుల అభివృద్ధి ఒక్కటే మార్గం. అందుకోసం అందరికీ నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు అందించాలి. ఇవి తప్ప వేరే మంత్రాలు, తాయిలాలు పేదరికాన్ని పోగొట్టలేవు. విద్య కొందరికే అందటం, కులవివక్షకి, అసమానతలకి గురవుతున్న కుటుంబాలకి ఎదిగే అవకాశాలు కొరవడటం మన అభివృద్ధి నమూనాలో కీలకాంశాలుగా తయారయ్యాయి. దాంతో చట్టంలో అందరికీ సమాన హక్కుల్ని కల్పించుకున్నా, ఆచరణలో అమలు కాలేదు. విద్య అందకపోవటంతో కూలీ కొడుకు కూలీగాను, పనిమనిషి కూతురు పనిమనిషిగాను బతకాల్సి వస్తోంది. విద్య ద్వారా సంపద సృష్టించే శక్తి అందనప్పుడు సహజంగానే అసమానతలు పెరుగుతాయి. ఇలా పుట్టిన కులం, కుటుంబం కారణంగా వచ్చిన అసమానతలు కొనసాగటానికి మనం చేపట్టిన విధానాలు కారణమయ్యాయి. ఈ అవిద్య తద్వారా పేదరికం మన ప్రజాస్వామ్యాన్ని, స్వపరిపాలనను మరింత బలహీనపరిచాయి. ప్రమాదంలోకి నెడుతున్నాయి. విద్య లేక పేదరికంలో మగ్గే ప్రజలు డబ్బుకో, మద్యానికో లంగిపోవటం తేలిక. ఇలా పరాధీనులయి, ప్రలోభాలకు తేలిగ్గా లంగే ఓటర్లుండటం పెత్తందారులకి అవసరం. ఈ విధంగా అపసవ్య విధానాలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచగా, ప్రజాస్వామ్యంలోని ఈ లోపాల వల్ల విద్య, ఆరోగ్య రంగాలపై శ్రద్ధ తగ్గింది. ఇలా ఒక విషవలయంలో చిక్కుకున్నాం.

విద్య, ఆరోగ్యాల్ని సక్రమంగా అందించలేకపోవటం వల్లే స్వేచ్ఛావాణిజ్యం, ప్రపంచీకరణ వల్ల వచ్చిన విస్తృత అవకాశాలను మనం సక్రమంగా పొందలేకపోతున్నాం. మలేషియా, సింగపూర్ లాంటి దేశాల్లో విద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేసి ఆ పునాదుల మీద బలమైన స్వేచ్ఛావాణిజ్య వ్యవస్థను నిర్మించారు. కానీ మనరాష్ట్రంలో 1994-95 తర్వాత రాష్ట్రంలో స్వేచ్ఛావాణిజ్యం ప్రవేశించినా తొలి నుంచీ విద్య, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ రావటం వల్ల ఫలితాలు కొంతమంది వ్యక్తులకు, సంస్థలకే పరిమితమయ్యాయి. పేదలకు కొద్దిగా మాత్రమే అందాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వాలు ఇప్పటికి కూడా నిర్మాణాత్మక కృషి చేయటం లేదు. విద్య, ఆరోగ్యరంగాలను ప్రైవేటీకరించి ఆ బాధ్యతల నుంచి తప్పుకునే పనిలో ఉన్నాయి. ఈవేళ జాతీయ సగటుకన్నా తక్కువగా విద్యకు కేటాయిస్తున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. భారత ప్రభుత్వం నుంచి పాఠశాల విద్యకు నిధులు పెరుగుతున్నా, రాష్ట్రం అందించే వాటాను విడుదల చేయకపోవటం వల్ల వందల కోట్ల నిధులు మురిగిపోతున్నాయి. ఉదాహరణకు 2009-10లో ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)కు రూ.1100కోట్లు వినియోగించుకునే అవకాశమున్నా మ్యాచింగ్ గ్రాంటును రాష్ట్రం విడుదల చేయకపోవటం వల్ల కేవలం రూ.425 కోట్లు మాత్రమే ఉపయోగించుకోగలిగాం. అదేనిర్లక్ష్య ధోరణిని రాజీవ్‌గాంధీ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ)లో కూడా కొనసాగుతోంది. మరోవైపు వినియోగించుకునే నిధుల విషయంలో కూడా ముందుచూపు, నాణ్యతా ప్రమాణాల పట్ల దృష్టి లేదు. ఆరు, ఏడు తరగతుల్లో చదువుతున్న విద్యార్థులలో 70శాతం మందికి పైగా ఒక చిన్న భాగాహారం చేసే శక్తి లేదని ప్రామాణిక సర్వేలు తెలియచేస్తున్నాయి. అలాంటి పైపై చదువులతో 21వ శతాబ్దంలో ఉపాధిని పొందటంగానీ, సంపద సృష్టిలో పాలుపంచుకోవటంగానీ అసాధ్యం. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య దాకా ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాల వల్ల డిగ్రీలున్నా నైపుణ్యం లేని యువతను మనం తయారుచేస్తూ మరింత అల్లకల్లోలానికి కారణమవుతున్నాం.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ప్రజల్లో చాలీచాలని స్వావలంబనతో ఉన్నవారు కూడా క్రమంగా గుర్తిస్తున్నా వారికి ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వాసం లేక ప్రైవేటు స్కూళ్లవైపు

మొగ్గుచూపుతున్నారు. పాఠశాలకు వెళ్లే ఇద్దరు పిల్లలున్న ఒక కుటుంబం స్కూలు ఫీజుల పేరుతో ఏటా సుమారు రూ. 94,000 ఖర్చు చేస్తోందని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో కూడా బోధనాప్రమాణాలు పెద్ద మెరుగ్గాలేకపోయినా, ప్రభుత్వ స్కూళ్ల కంటే ప్రైవేటు పాఠశాలల్లో మౌలికవసతులు కాస్త మెరుగ్గా ఉంటాయనేదే ప్రజల మొగ్గుకు కారణం కావచ్చు. రాజకీయాల్లో, తద్వారా పాలనలో విద్యకు మనం ప్రాధాన్యత ఇవ్వకపోవటం వల్లే చాలా మూల్యం చెల్లించాం. విద్య ద్వారా అభివృద్ధిని ప్రజలు గుర్తించాక కూడా దాన్ని సరైన దిశలో మళ్లించకుండా విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చివేసి ప్రజల్ని దోచుకునేందుకు పాలకులే మార్గం వేశారు. కావలసిన విద్యార్హతలు, విద్య పట్ల ఆపేక్ష లేనివారు కేవలం కరెన్సీ నోట్లతో విద్యాసంస్థల్ని స్థాపించేస్తున్నారు. అణగారివర్గాలను, అగ్రవర్ణాలలోని పేదలను సంతృప్తి పరిచేందుకు పాఠశాలల, కళాశాలల సంఖ్యను పెంచారుతప్ప వాటిలో మౌలిక వసతులు లేవు. తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉండరు. మరోవైపు, సిలబస్‌లో, బోధనాప్రమాణాలలో నాణ్యతా ప్రమాణాలు లేవు. అక్షరాస్యత ఉన్న అజ్ఞానుల్ని, నైపుణ్యాలు లేని నిరుద్యోగుల్ని తయారుచేస్తున్నాం. మొత్తం మీద డబ్బులేనివారికి మంచి చదువు అందదు అనే వ్యవస్థను మనం నిర్మించుకున్నాం.

అలాగే కేవలం వైద్యఖర్చులు భరించలేక వేలాదిమంది రోజూ ఇళ్లవద్దే నిశ్శబ్దంగా బాధను భరిస్తున్నారు. మరికొంతమంది వైద్యఖర్చుల చెల్లింపుతో పేదరికంలోకి జారిపోతున్నారు. ప్రాథమికస్థాయి నుంచి వైద్యంతో పాటు ప్రజల ఆరోగ్యానికి తగిన ఏర్పాట్లు ప్రభుత్వమే చేయాల్సి ఉంది.

ప్రజల్ని బిచ్చగాళ్లుగా కాకుండా తలెత్తుకుని తిరిగే ప్రభువులుగా నిలబెట్టే విద్య, ఆరోగ్యాన్ని, ఉపాధిని ఇవ్వాలని వ్యక్తిగతంగా కొందరు రాజకీయ నేతలకు స్పష్టంగా తెలిసినా, రాజకీయం సాంప్రదాయ పెత్తందారీ వ్యవస్థగా మారిపోవటంతో దాన్ని కదిలించే శక్తిలేక సర్దుకుపోతూ వస్తున్నారు. ప్రథమ స్థాయి అవకాశాలున్నా అథమ స్థాయి రాజకీయాల వల్ల రాష్ట్రం ఒక పరిమితిని దాటి ఎదగలేక కొట్టుమిట్టాడుతోంది. మన రాష్ట్రంలో కొద్ది మందికి ప్రతి ఏటా ఆరోగ్యశ్రీ పేరుతో కార్పొరేట్ ఆస్పత్రులలో ఆపరేషన్‌లు జరుగుతున్నాయి, దానినే ఆరోగ్యం అనుకొని ప్రజారోగ్యవ్యవస్థని, కుటుంబ ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అలాగే కార్పొరేట్ కాలేజీలలో పేలవమయిన విద్యనిస్తుంటే, ఆ కాలేజీలలో ఫీజులు కడితే అందరికీ విద్య అందించినట్లుగా ప్రభుత్వం బావిస్తోంది.

## 2. రైతు వ్యతిరేక విధానాలు

ఇంతకు ముందు పేర్కొన్న పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే సాంప్రదాయ రాజకీయ క్రీడలో భాగంగానే వ్యవసాయాన్ని కూడా పాలకులు చూశారు. తాయిలాల ఫార్ములానే అమలుచేస్తూ వచ్చారు. 'పంటలకు ఎప్పటికీ మంచి ధర లభించకూడదు, వ్యవసాయం ఎప్పటికీ కనీసస్థాయి ఆదాయం దాటని వృత్తిగానే మిగిలిపోవాలి. రైతులు నిరంతరం ప్రభుత్వ తాయిలాల కోసం అర్రులు జాస్తూ మా మోచేతి కిందే ఉండాలి' అన్నదే వారి లక్ష్యంగా ఉంది. అందుకే ఆహారభద్రతనిచ్చే రైతును పూర్తిగా నిర్లక్ష్యం చేసే విధానాలను అవలంబించారు. రాష్ట్ర జనాభా ఎనిమిదిన్నర కోట్లలో సగంమంది ఓటర్లుగా ఉన్నారనుకుంటే అందులో 1.2 కోట్లమంది రైతులు, 60లక్షలమంది కౌలుదారులు ఉన్నారు కాబట్టి వారి ఓట్లు పోకుండా ఎప్పుడైనా వరదలు, కరువులు వంటివి వచ్చినప్పుడు తాత్కాలిక రాయితీలు, రుణమాఫీలు చేసి ఏదో చేసినట్టు నటిస్తూ రావటం పాలకులకు ఆనవాయితీగా మారిపోయింది. మాది రైతుప్రభుత్వం, రైతే దేశానికి వెన్నెముకలాంటి చిలకపలుకులు వల్లించటం మినహా రైతుకు ఇప్పటివరకూ ఉన్న పాలకులు చేసింది నష్టమేతప్ప ఏమాత్రం లాభంకాదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. రాష్ట్రంలో గత దశాబ్దంలో వరుసగా ఐదారేళ్లు మంచివర్షాలు కురిసినా, ఆహారధాన్యాలు ఇబ్బడిముబ్బడిగా పండినా రైతులు మాత్రం నష్టాల్లో, అప్పుల్లో కూరుకుపోయి ఉండటం, రైతుల ఆదాయం ఏమాత్రం పెరగకపోవటమే ఇందుకు నిదర్శనం. వర్షాలు కురవకపోతే ఎలాగూ రైతు నష్టపోతాడు, ప్రకృతి పుణ్యమాని మంచి పంటలు పండినా కూడా రైతుకు ఆదాయం రాదు అనే తీరుగానే ప్రభుత్వాలు విధానాలు అమలు చేశాయి.

గ్రామాల్లో వ్యవసాయరంగంలో ఉన్నవారి తలసరి ఆదాయం ఏటా రూ. 15,000 ఉంటే, పట్టణాల్లో వ్యవసాయేతర రంగాల్లో ఉన్నవారి ఆదాయం రూ. 1,05,000 ఉంది. అంటే ఏడు రెట్లు ఎక్కువ. వ్యవసాయరంగంలో పరిస్థితి ఇదే తీరుగా ఉంటే రాబోయే పదేళ్లలో గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ

ప్రాంతాలలో వారి ఆదాయాల మధ్య వ్యత్యాసం 16 నుంచి 17రెట్లు పెరుగుతుందని అంచనా. ఈ తీవ్ర అసమానతలు రాష్ట్రాభివృద్ధికి, రాజకీయ, సామాజిక సుస్థిరతకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. రైతులు కూలీలయ్యారు. అయినా నిలదొక్కుకునే పరిస్థితి లేక చిన్న ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస బాట పట్టారు. వ్యవసాయం మీద ఆధారపడిన చేతివృత్తులు ధ్వంసమయ్యాయి. గ్రామాల్లోని దళితులు, బలహీనవర్గాలు కేవలం తాము రైతులమని చెప్పుకునేందుకు పొలాల్ని కౌలుకు తీసుకుంటున్నారు. వారికి చేలగట్ల మీద పచ్చగడ్డితో పాడిపశువుల ద్వారా ఆదాయం తప్ప పంటల ద్వారా మిగిలేదేమీ లేదు. శ్రమ వృథా అవటం మినహా. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంది కాబట్టే వ్యవసాయానికి ఎంతో చేశామని చెప్పుకుంటున్న నేతలతో సహా ఎవరూ తమ పిల్లల్ని వ్యవసాయంలో కొనసాగించటానికి ఇష్టపడటం లేదు. అసలు వ్యవసాయదారుడికి పిల్లనిచ్చే వారే కరవయ్యారు. ఇది రాష్ట్రానికి చాలా పెద్ద ప్రమాదంగా మారుతోంది.

ఆహారోత్పత్తి చేసే రైతులకు ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటి చేయకపోతే ఈ సంక్షోభం వ్యవస్థల్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. రైతులు తమ గుప్పెట్లోనే ఉండేందుకు, తలెత్తుకుని బతకకుండా ఉండేందుకు అతిపురాతనమైన, అవినీతిమయమైన విధానాల్ని వ్యవసాయంలో పాలకులు అనుసరిస్తున్నారు. ఉదాహరణకు రాష్ట్రంలో సుమారు 80లక్షల టన్నుల బియ్యం అవసరమైతే, అంతకు రెట్టింపు ఉన్నా కూడా ఎగుమతికి అనుమతివ్వకపోవటం వల్ల రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. గత ఏడాది పంట బాగా పండినా ధర రాక నిల్వచేసుకున్నవారికి ఈ ఏడాది పరిస్థితి మరీ దయనీయంగా మారింది. జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో కూడా లేనటువంటి స్థాయిలో రాష్ట్రంలోని జిల్లాల మధ్య, రాష్ట్రం వెలుపల దేశం పరిధిలో కూడా బియ్యం రవాణా చేయకూడదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంక్షల్ని అమలుచేస్తోంది. డిసెంబర్, 2010లో అకాల వర్షాలు కురిసి కొంత వరి పంట దెబ్బతింటే మొత్తం నష్టాన్ని వర్షానికి అంటగట్టి తాత్కాలిక నష్టపరిహారాలతో తప్పించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. రైతులకష్టాలు ప్రకృతి శాపంకాదు, పాలకుల పాపం అని వాస్తవాలు చూస్తే అర్థమవుతుంది.

కిలో సూపర్‌ఫైన్ రకం బియ్యం ప్రపంచ మార్కెట్లో రూ. 80 ఉన్నప్పుడు మన వద్ద రైతుకు కేవలం రూ. 10-15 దక్కటం ఎంత దుర్మార్గం? డిమాండ్ ఉన్నచోటికి తాను పండించిన బియ్యాన్ని ఎగుమతి చేసుకునే అవకాశం లేకుండా రైతును తొక్కేయటం ఎంత అమానుషం? ఏ రంగంలోని వారికీ లేని ఈ దారుణ నిర్బంధాలు రైతులకే ఎందుకు? వారికి వాస్తవాలు తెలియవనా లేక వారు నిలదీయలేరనా? పురాతన కాలంనాటి వ్యవసాయార్థిక విధానాలతో రైతుల్ని నాశనం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాల్వాలో ధాన్యం సరాసరి దిగుబడి బస్తా 75 కిలోల చొప్పున 22 బస్తాలు లేదా 16.5 క్వింటాళ్ళు. ఎకరా సాగువ్యయం రైతుకు రూ. 16,000 అవుతుండగా, కౌలురైతుకు రూ. 25,000 అవుతోంది. ఒకవేళ ప్రభుత్వం క్వింటాలుకు రూ. 1000/రూ. 1030 మద్దతు ధరను అందించినా, రైతుకు కేవలం తన పెట్టుబడి మాత్రమే వస్తుంది, కౌలురైతుకు నికరంగా నష్టం వస్తుంది. ఎగుమతి ద్వారా వచ్చిన లాభాల్ని రైతులకు పంచినా మంచి ఆదాయాన్ని ఇవ్వొచ్చు. అలాగే బియ్యం మీద కూడా ఎక్కడాలేని రీతిలో రూ. 1500కోట్ల మేర రకరకాల పన్నుల్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధిస్తోంది. ఆ డబ్బుతో రైతు కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం క్వింటాలుకు రూ. 200 బోనస్‌ను ఇవ్వాలని అడిగినా ప్రభుత్వం స్పందించలేదు. చెరకుకు మూడేళ్లక్రితం వరకూ టన్నుకు రూ. 1000 కూడా ఇవ్వలేదు, ఈ ఏడాది క్రషింగ్ సీజన్ అయిపోతున్నా రాష్ట్ర సూచిత ధరను ప్రకటించలేదు. మార్కెట్‌యార్డుల్ని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చివేయటంతో రైతుల్నుంచి వసూలు చేసిన సెస్సు పక్కదారి పడుతోంది. మరోవైపు నూనెగింజల ఉత్పత్తిలో మనం చాలా అనుకూల పరిస్థితుల్లో ఉంటే దిగుమతి సుంకాల్ని విధించే దిశగా ప్రయత్నమే చేయలేదు. 85లక్షల టన్నుల వంటనూనెని దిగుమతి చేసుకుంటున్నపుడు,ఆ నూనె మీద కొద్దిపాటి సుంకం వేసి, ఆ ఆదాయాన్ని నూనె గింజల రైతులకి బోనస్‌గా ఇస్తే మూడేళ్ళలో దిగుమతులు అవసరం లేకుండా దేశాన్ని స్వయం సమృద్ధం చేయవచ్చు. అయినా ఒక్కరూపాయి కూడా దిగుమతి సుంకం లేదు। లాగే ఫంగేషియస్ రకం చేపల దిగుమతిని సుంకం లేకుండా అనుమతించటంతో ఇక్కడ రేట్లు పడిపోయి చేపల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి. "మన వ్యవసాయాన్ని నాశనం చేసి, రైతుల్ని, కౌలురైతుల్ని నిరుపేదలుగా మార్చి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం

చేయాలనుకుంటే ప్రభుత్వం ఇంతకంటే ఇంకేమీ చేయనక్కర్లేదు". దీనివల్ల మిగిలిన ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటోంది. పారిశ్రామిక ఉత్పత్తులు, సేవలు కేవలం 30శాతం ప్రజలకే పరిమితమవుతునాయి. రాష్ట్ర ఆర్థిక ప్రగతిని వెనక్కిలాగే రీతిలో ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. అంతిమంగా ఆర్థికవ్యవస్థ స్తంభించి అందరూ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

## 3) విశృంఖల అవినీతి

అవినీతి అనే భయంకర జాడ్యానికి కూడా పైన పేర్కొన్న అధికార కేంద్రీకరణ, విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాల లేమితో పేదరికం నిరంతరం కొనసాగుతుండటంతో సంబంధం ఉంది. వాటికి నీతిలేని రాజకీయాలు, బలహీన చట్టాలు, ఎన్నికల వ్యవస్థలో లసుగులు తోడవటంతో ఈవేళ రాష్ట్రంలో అవినీతి పరాకాష్టకు చేరుకుంది. అవినీతి రాష్ట్రంలో కొత్తేమీ కాకపోయినా విస్తృత అవకాశాలనిచ్చే ప్రపంచీకరణ నేపథ్యానికి తగిన పాలనాసంస్కరణలు లేకపోవటంతో పెరిగి ఈవేళ వికృతస్థాయికి, ప్రజల సార్వభౌమాధికారాన్నే ప్రశ్నించేస్థాయికి చేరుకుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన ఆర్థిక సంస్కరణలు కొత్త అవకాశాలను అందించటంతో రాజకీయాలకు, వాణిజ్యరంగానికి మధ్య బంధం పెరిగింది. ఏదోకరూపంలో రాజకీయాల్లో పెట్టుబడి పెట్టి తద్వారా వాణిజ్య అవకాశాలను పెంచుకునేందుకు సంస్థలు ప్రయత్నాలు పెద్దఎత్తున మొదలుపెట్టాయి. ఈ క్రమంలో రాష్ట్ర వనరులు అవినీతికి పెట్టుబడులుగా మారాయి. ప్రజల పన్నుల డబ్బు అవినీతికి ఆస్కారమున్న రీతిలో ఖర్చయ్యాయి. సంక్షేమం, అభివృద్ధి ముసుగులో ప్రధానంగా జరిగిందిదే. క్రమంగా రాజకీయ నేతలు వ్యాపారరంగాల్లో పెట్టుబడులు పెట్టటం మొదలుపెడితే, అప్పటిదాకా పార్టీలకు విరాళాలిచ్చిన వాణిజ్యవేత్తలు నేరుగా రాజకీయాల్లోకి వచ్చి రాత్రికి రాత్రే అభ్యర్థిగా నిలబడటం మొదలుపెట్టారు. అంతకుముందెన్నడూ చూడనిరీతిలో ఎన్నికల్లో డబ్బు ప్రవాహం మొదలైంది. గెలిచాక అంతకు పదిరెట్లు సంపాదించుకునే వీలుండటంతో రాజకీయాలు పక్కా వ్యాపారంగా మారిపోయాయి. అవినీతి గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియకుండా అంతా తమ గుప్పెట్లోనే ఉండేలా అధికారాన్ని పూర్తిగా రాష్ట్ర రాజధానిలోనే కేంద్రీకరించారు.

ఇలా శరవేగంగా వందల వేలకోట్ల రూపాయలకు అవినీతి విస్తరించింది. చివరికి పరిమితమైన, అత్యంత విలువైన సహజ వనరుల్ని ఇష్టమొచ్చినట్టు పందేరం చేసి అప్పనంగా దోచుకునే కార్యక్రమం మొదలైంది. దక్షిణ కోస్తా ప్రాంతంలో 3 పోర్టుల నిర్మాణం పేరుతో ఒకే గ్రూప్ కంపెనీకి 348 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని ధారాదత్తం చేశారు. నెల్లూరు తడ నుంచి తూర్పుగోదావరి జిల్లా నర్సాపూర్ వరకూ తీరమంతా కాకులు, చీమలు సైతం దూరకుండా ఎక్స్‌క్లూజివ్ జోన్ పేరుతో పందేరం చేసేశారు. రస్‌అల్‌ఖైమా అనే గోచీపాతంత దేశంతో కనీస ప్రమాణాలు కూడా పాటించకుండా ఎనిమిదిన్నర కోట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీ టూ జీ ఒప్పందం కుదుర్చుకుంది. ఏ పోటీ లేకుండా ఓడరేవులని లంచాలు, వాటాలు ఇచ్చిన వాళ్ళకి కట్టబెట్టడం కోసం,కకేవలం నాలుగు బిలియన్ డాలర్ల జాతీయ ఆదాయం ఉన్న ఒక చిన్న దేశంతో ఆషామాషీ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఓపక్క ఇలా భూముల్ని ధారాదత్తం చేసేసి మరోపక్క అసంబద్ధమైన విద్యుత్ ప్రాజెక్టుల కోసం పచ్చని పంటపొలాల్ని రైతుల నుంచి లాక్కొంటున్నారు. ఈ వ్యవహారాలన్నిటిలో ప్రభుత్వ సంస్థలు, ఉన్నతాధికారులూ సూత్రధారులుగా వ్యవహరించారు. అవినీతికి పాల్పడి, సహకరించేవారికి ప్రోత్సాహం, అవినీతిని సహించనివారిని తొక్కిపారేయటం వ్యవస్థలో ప్రమాణాలుగా మారాయి.

ఖనిజాభివృద్ధి సంస్థనే తీసుకుంటే... ప్రభుత్వమే ప్రైవేటు పార్టీలకు ఏ పోటీ లేకుండా గనుల లీజుల్ని అప్పగిస్తూ కేవలం రాయల్టీ మినహాయించి వారికి లాభాల్లో కించిత్తు కూడా వాటా లేకుండా వారు ఇష్టమొచ్చినట్టు అమ్ముకునే అడ్డూఅదుపూలేని స్వేచ్ఛనిచ్చింది. మరోవైపు తాను కొనుగోలుదారులుగా ఎంచుకున్నవారి నుంచి వచ్చే ఆదాయాన్ని పరిమితం చేయటం ద్వారా రాష్ట్రాన్ని కొల్లగొట్టే అవకాశమిచ్చింది. అలాగే భూముల విషయంలో సంబంధిత సంస్థ. ఆంధ్రప్రదేశ్‌లో ముడిఇనుముతోపాటు, బాక్సైట్, గ్రానైట్ వంటి విలువైన సహజవనరులు పెద్దఎత్తున ఉన్నాయని, వాటి విలువ అనేక లక్షలకోట్లు ఉండటంతో వాటి లైసెన్సులు చేజిక్కించుకునేందుకు పెద్దఎత్తున పోటీనెలకొంటే, మొదట వచ్చిన వారికే మొదటి కేటాయింపు చేస్తున్న ప్రస్తుత మైనింగ్ లీజు విధానంవల్ల అనూహ్యస్థాయి అవినీతికి ఆస్కారమేర్పడింది. సాధారణ,

మధ్యతరగతి ప్రజలు ఒక చిన్న నివాసఫ్లాట్ కొనుగోలు చేయాలంటేనే ప్రభుత్వం బహిరంగ వేలం పాటల్ని నిర్వహిస్తుంది. కానీ రాష్ట్ర బడ్జెట్‌కు అనేక రెట్లు ఉండే గనుల లీజుల్ని మాత్రం ప్రభుత్వం అప్పనంగా కొద్దిమంది ఎంపిక చేసిన వ్యక్తులకు ఇచ్చేసింది. డబ్బులు లేవంటూ సర్వశిక్షా అభియాన్‌కు, ఫీజు రీఇంబర్స్‌మెంటుకు కూడా తగినన్ని నిధుల్నివ్వకుండా, ఆదాయం కోసమంటూ మద్యాన్ని విచ్చలవిడిగా పంపిణీ చేస్తూ పేదల నుంచి వేల కోట్లు పిండుతున్న ప్రభుత్వం... గనులలీజులు వంటి భారీ ఆదాయమార్గాల్ని మాత్రం తనకు నచ్చినవారి కోసం గాలికొదిలేసింది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా గనుల విధానంలో దోపిడీకి ఆస్కారమిచ్చే అదే విధానాన్ని అనుసరిస్తూ వస్తున్నాయి. పార్టీలు, సిద్ధాంతాలు పూర్తిగా ఔచిత్యాన్ని కోల్పోయాయి. రాష్ట్ర వనరులపై పెత్తనం కోసం కొట్లాడుకునే ముఠాల్లాగా రాజకీయ పార్టీలు మారిపోయాయి.

ఈ మొత్తం ప్రక్రియలో అవినీతి స్థాయిలో తేడా ఉండవచ్చుగానీ వరుస ప్రభుత్వాలు ఇందుకు బాధ్యత వహించాల్సుంటుంది. అధికారంలో ఉన్న పార్టీల నేతలు పరస్పరం పెద్ద పెద్ద అవినీతిఆరోపణలు చేసుకుంటున్నారు. కుంభకోణాల స్థాయిలో తేడా ఉండొచ్చుగానీ అవినీతిమాత్రం జరిగిందనటానికి ప్రాథమిక సాక్ష్యాధారాలు కనిపిస్తున్నాయి. రెండు పార్టీల నేతలూ ఒకరి మీద ఒకరు చెప్పేది నిజమనేది తేటతెల్లం. వాళ్లు రాజకీయాల్లోకి వచ్చినప్పుడు వాళ్ల ఆస్తుల్ని, ఇప్పుడు ఆస్తుల్ని పోల్చుకుంటే చాలు ప్రాథమిక పాఠశాల విద్యార్థికి కూడా ఆ నేతల అవినీతి అర్థమవుతుంది. హైదరాబాద్ నుంచి జిల్లాల స్థాయి వరకూ అవినీతి యధేచ్ఛగా జరుగుతున్నా ఏ నాయకుడి మీదా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎవరినీ జైల్లోకి పంపి ఆస్తుల్ని జప్తుచేసిన ఉదంతాలు లేవు. చిన్నచిన్న అధికారుల మీద తప్ప ఉన్నతాధికారుల మీద కొరడా ఝుళిపించిన సాక్ష్యాలు లేవు. వోక్స్‌వ్యాగన్ కోసం రూ. 10కోట్లు లెక్కాపత్రం లేకుండా రాష్ట్ర ఖజానా నుంచి తరలిపోతే ఆ అధికారి మీద చర్యలు లేవు. ఒక మట్టిపెళ్లను తొలగించకుండానే, ఒక ఎకరం భూమికి నీరు ఇవ్వకుండానే ఒక సాగునీటి ప్రాజెక్టు సర్వేకు రూ. 1000కోట్లు ఖర్చు పెడితే బాధ్యులైన నేతలు, మంత్రులు, అధికారుల మీద చర్యలు లేవు. అసంబద్ధమైన ఆ ప్రాజెక్టు మీద ఖర్చు చేసిన రూ. 1000కోట్లతో దాదాపు 5లక్షలమంది విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్ చేయటమో లేక అంతేమంది యువతకు ఉద్యోగ, జీవనోపాధి సంపాదించుకునే ఏర్పాటు చేయటమో సాధ్యమయ్యేది. వేలాది ఎకరాల భూముల్ని విచక్షణాధికారాన్ని అడ్డంపెట్టుకుని పంచేశారు.

అధికార కేంద్రాలకు దగ్గరగా ఉన్న కొంతమంది కోసం అత్యుత్సాహంతో, ఉదారంగా నిధులను విడుదల చేస్తుంటే, అవసరమైన పథకాలకు మాత్రం నిధుల కొరత ఏర్పడి నిజమైన అభివృద్ధి ఆగిపోయింది. ఇలా వేల కోట్ల రూపాయల వనరుల్ని, ప్రజాధనాన్ని లూటీ చేసినవారు తిరిగి ఆ డబ్బును వెదజల్లి రాష్ట్రాన్ని టోకుగా కొనుగోలు చేస్తూ ఎన్నికల్లో గెలుపునకు ప్రయత్నిస్తున్నారు. కొందరు నేతలు ఏకంగా కొన్ని జిల్లాలలోని నియోజకవర్గాలన్నిటినీ గుప్పెట్లో పెట్టుకున్నారు. ప్రజాస్వామ్యానికే ప్రమాదకరస్థాయిలో వీరు అవినీతి డబ్బుతో ఎదిగారు. కించిత్తు ప్రజాసేవ చేయకపోయినా వీరిని ప్రజానాయకులుగా ప్రచారం చేసేందుకు మీడియాను కూడా గుప్పెట్లో పెట్టుకున్నారు. రాష్ట్రంలో కొందరు ఐ.ఏ.ఎస్ అధికారులు ఒక్కొక్కరూ ఈవేళ రూ. 1000కోట్లకు పైగా అక్రమ సంపాదన చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేతలు తెలివిగా పేదరికం వల్ల ప్రజలు నిబంధనలకు మించి రేషన్ కార్డుల కోసం, ఇళ్ల స్థలాలు తీసుకునేలా చేసి అవినీతి సర్వత్రా ఉంది, అందరూ బాధ్యులే అనే అపరాధ భావనను వారిలో పెంచారు. తమ నిత్యజీవితావసరాల కోసం ఓ పట్టాదారు పాసుపుస్తకం కోసమో, మరో అవసరం కోసమో నిస్సహాయ స్థితిలో లంచం ఇచ్చే సాధారణ ప్రజలు నేరుగా ప్రభుత్వం సృష్టించిన అవినీతిమయ పరిస్థితుల్లో చిక్కుకుని అవినీతిపై వేగంగా స్పందించలేని విచిత్ర పరిస్థితిలో చిక్కుకుపోయారు.

## 4) చట్టబద్ధ పాలన కొరవడటం

ఈ సమస్యకు కూడా విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు అందకుండా పేదరికాన్ని కొనసాగిస్తుండటం, అధికారాన్ని కేంద్రీకరించటం మూలకారణాలుగా ఉన్నాయి. వీటివల్ల ప్రజల్లో అశాంతి పెరుగుతూ పట్టణ ప్రాంతాలకు వలసలు విపరీతమైపోయాయి. పొట్ట చేత పట్టుకుని నైపుణ్యాలు లేకుండా వచ్చేవారు ఏదోకరకంగా బతికేక్రమంలో నేరాలకు పాల్పడుతున్నారు. తమ దోపిడీకి, గూండాయిజానికి, ఎన్నికల్లో గెలుపునకు పోలీసువ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న రాజకీయ

నాయకుల వల్ల చట్టబద్ధ పాలన నామమాత్రంగానే మిగిలింది. దొరక్కుండా నేరాలు చేసేయవచ్చని, ఒకవేళ దొరికినా నేతల అండదండలుంటే హాయిగా బైటికి వచ్చేయవచ్చని, పొరపాటున జైలుకెళ్లినా అన్ని సుఖాల్నీ అనుభవించవచ్చనే వాతావరణాన్ని కల్పించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా నేరాలకు వినియోగిస్తున్నారు. తేలిగ్గా జీవించటంతోపాటు నేరస్తులకు రాజకీయ నేతలే డిమాండ్ కల్పిస్తుండటం నేరాలు పెరిగిపోవటానికి కారణంగా ఉంది. తమ ఆలోచనలతో, చర్యలతో అభివృద్ధిని, ప్రజాభిమానాన్ని సాధించలేని పాలకులు కేవలం పోలీసుల ఆసరాతో నేతలుగా చెలామణి అవుతున్నారు. ప్రత్యర్థుల్ని కట్టడి చేయటానికి, సొంత బలాన్ని పెంచుకోవటానికి పోలీసు వ్యవస్థను వారు దుర్వినియోగం చేస్తున్నారు. సరైన జీవనోపాధి, తప్పు చేస్తే శిక్ష పడుతుందన్న భయం ఎప్పుడైతే లేదో నేరాలు పెరగటమే తప్ప తగ్గటముండదు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నదదే. పోలీసుల నియామకాలు, బదిలీల్లో యధేచ్ఛగా రాజకీయ జోక్యం ఉంటోంది. దీనివల్ల ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతూ బడితె ఉన్న వాడిదే బర్రె అనే సంస్కృతి ప్రబలుతోంది. అరాచకత్వం విస్తరిస్తోంది.

... ఇక పేదరికాన్ని కొనసాగించటం, జనం చేతికి అధికారాన్నివ్వకుండా కేంద్రీకరించటం, విశృంఖల అవినీతి, చట్టబద్ధ పాలన కొరవడటం వల్ల రాష్ట్రంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితికి ప్రత్యేక తెలంగాణ అంశం, వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం గాలుల్లా తోడై మంటలు రాజేశాయి. కల్లోలానికి తక్షణ కారణాలుగా ఈ రెండు అంశాల్నీ చెప్పుకోవచ్చు.

## బి) సంక్షోభానికి తక్షణ కారణాలు:

**ఇందులో 1) తెలంగాణ అంశం 2) వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణాన్ని ప్రధానంగా చెప్పుకోవచ్చు.**

### 1) తెలంగాణ అంశం

పేదరికం, ఉపాధి లేకపోవటం, విశృంఖల అవినీతి, స్థానికంగా అధికారాలు, అభివృద్ధి లేకపోవటంతో ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి తెలంగాణ ఉద్యమంతో ఒక్కసారిగా రాజుకున్నాయి. తెలంగాణ వస్తే తమకు ఉద్యోగాలు లక్షల్లో వస్తాయనే భ్రమలోకి యువతను నెట్టి సమిధలుగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. సమస్యలతో నలిగిపోయి, ఎన్నో ఏళ్లుగా మోసపోతున్న తెలంగాణ ప్రజలలో... మీ సమస్యకు అవతలి ప్రాంతంవారు కారణమని చూపిస్తూ కొందరు రాజకీయనేతలు, పార్టీలు చేసిన ప్రచారం ఆగ్రహజ్వాలల్ని పెంచింది. ఇది రాష్ట్రంలో ద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టించి సమస్యను పక్కదోవ పట్టించింది. రాజకీయపార్టీలు హేతుబద్ధ చర్చను, సుహృద్భావ వాతావరణాన్ని, రాజ్యాంగ విలువల్ని పెంపొందించాల్సిన బాధ్యతను విస్మరించి బహిరంగచర్చ ప్రమాణాల్ని కాలరాయటంతో రాష్ట్రంలో అరాచకత్వం పెరుగుతూ అభివృద్ధి కుంటుపడసాగింది. పేరుకుపోయిన సామాజిక అశాంతి తాజా తెలంగాణ ఉద్యమం ద్వారా అభివ్యక్తమవుతోంది.

ఏ ప్రాంతంలో, ఏ వర్గం ప్రజలు దోపిడీకి గురైనా అందుకు అక్కడి రాజకీయ నాయకులు, అధికారులే ప్రధాన కారణమవుతారు తప్ప పనిగట్టుకుని వివక్షను చూపటం భారత రాజ్యాంగం ప్రకారం సాధ్యం కాదు. రాజ్యాంగం, ప్రభుత్వం, రాజకీయ వ్యవస్థ గురించి ప్రజలకు అవగాహన లేకుండా చేస్తూ పాలనను గందరగోళంగా మార్చివేసి, రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవుల్లోకి వచ్చినవారే రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు. సరిగ్గా ఇలాంటి పరిస్థితే తెలంగాణ అంశాన్ని రాష్ట్రంలో రావణకాష్టంలా మార్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా కంటే తక్కువ జనాభా కలిగిన దేశాలు ప్రపంచపటంలో 100కు పైగా ఉన్నాయి. మరో రాష్ట్రం ఏర్పడినంతమాత్రాన కొంపలేమీ మునిగిపోవు. ఇది చాలా సాధారణ, పరిపాలనాపరమైన ఏర్పాటు మాత్రమే. సరిహద్దు మారుతుందంతే. అయితే ఈ విషయాన్ని ప్రధాన రాజకీయపార్టీలు కేవలం పచ్చి రాజకీయ క్రీడగా మార్చి తెలంగాణ ప్రజల మనోభావాలతో ఆడుకున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఇవ్వటానికి, లేదా సమైక్యమే మేలనటానికి నిర్దిష్టమైన హేతుబద్ధ ప్రమాణాలు లేకుండా ఆ అంశంపై తమ నిర్ణయాన్ని కేవలం ఓటుబ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా తీసుకున్నాయి. తెలంగాణ ఏర్పాటు అవసరంపై విశ్వాసం లేకున్నా ఎన్నికల అవసరాల దృష్ట్యా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవటంతో కేంద్రప్రభుత్వం డిసెంబర్ 9, 2009న ప్రత్యేక తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి కొత్త కార్డును ప్రయోగించింది. దాంతో అధికార పార్టీతోపాటు ప్రధాన

ప్రతిపక్షం కూడా ప్రాంతాలవారీగా చీలిపోయింది. సమస్యను ఇన్నాళ్లూ మురగబెట్టిన పార్టీల తీరుపై ప్రజల్లో నెలకొన్న ఆగ్రహాన్ని బాధ్యత తీసుకుని చల్లార్చేందుకు కూడా ఆయా పార్టీల నాయకత్వం ప్రయత్నించలేదు. తెలంగాణ ప్రాంతం వెనకబాటుతనానికి మరో ప్రాంతం వాళ్లు కారణమంటూ ప్రజల్ని రెచ్చగొడుతున్నా వాస్తవాల్ని బైటపెట్టి ఓ సరైన పరిష్కారం దిశగా ప్రజల్ని ఆలోచింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోలేదు. మరోవైపు నిరాహారదీక్ష, ఇతర బెదిరింపులకు లంగి కీలక నిర్ణయాన్ని ప్రకటించటం ద్వారా ఓ ప్రమాదకర సాంప్రదాయానికి తెరతీసిన కేంద్రంలోని యూపీయే ప్రభుత్వం... రాష్ట్రంలో పార్టీలు చేతులెత్తేశాక కూడా సమస్యను పరిష్కరించేందుకు ముందుకు కదలకుండా బాధ్యతారహితంగా వ్యవహరించటంతో సమస్య జటిలమైంది.

భారతదేశమనే మైదానంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఫుట్‌బాల్‌లాగా మార్చారు. ఇరు ప్రాంతాల ప్రజలకూ వాస్తవాల్ని వివరించి రాష్ట్రం విడిపోవటం వల్ల ఉపద్రవమూ రాదు, మరోవైపు దాని వల్ల అద్భుతాలూ జరగవు, కాబట్టి సామరస్యంగా, పట్టువిడుపులతో నిర్ణయం తీసుకోవాలని ఒప్పించే ప్రయత్నమే కరవయ్యింది. ఇందులో రాష్ట్ర రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఘర్షణ వాతావరణానికి కేంద్రబిందువుగా నిలిచింది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలను గాలికొదిలేసి తమ దోపిడీకి వీలుగా హైదరాబాద్‌ను అపరిమితంగా అభివృద్ధి చేయటంతో హైదరాబాద్‌ను కోల్పోతే తామేదో ప్రధాన వనరును కోల్పోయామన్న భావన తెలంగాణేతర ప్రాంతాల్లో నెలకొంది. పెద్ద నగరాలు ఆర్థిక కకేంద్రాలుగా ఎదిగాయి. అలాంటి పెద్ద నగరం రాజదానిగా ఉన్న ప్రాంతం ప్రత్యేక రాష్ట్రాన్ని కోరటం దేశంలో ఇదే మొదటిసారి. తెలంగాణ ఏర్పాటు జటిలంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో ప్రయత్నించటం లేదు. ప్రజాస్వామ్యానికి పీఠమైన రాష్ట్ర శాసనసభలో తెలంగాణ అంశాన్ని చర్చించి పరిష్కరించుకుందామన్న ధ్యాసే లేదు. హేతుబద్ధ చర్చ, సామరస్య ధోరణితో ఈ సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలకు చొరవ లేదు. ప్రజాస్వామ్యంలో పరిష్కారం చర్చల ద్వారానే వస్తుంది తప్ప వేరే మార్గం లేదు. ఇచ్చిపుచ్చుకోవటమే తప్ప ఒకరు గెలవటం, ఇంకొకరు ఓడిపోవటం అనేవే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండవు.

## 2) వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం

పేదరిక నిర్మూలన, అవినీతి రహిత పాలన, జనం చేతికి అధికారం, నైతిక రాజకీయం లేకుండా కేవలం సంతృప్తస్థాయిలో పథకాల్ని అమలుచేయటమే లక్ష్యంగా వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన సాగటంతో ఆయన ఎంత వ్యక్తిగతంగా బలమైన నాయకుడైనా మరణానంతరం ఒక్కసారిగా రాష్ట్రంలో నాయకత్వ కొరత ప్రస్ఫుటంగా బైటపడింది. తెలంగాణ అంశం, వేలకోట్ల రూపాయల అక్రమార్జనతో ప్రజాస్వామ్యాన్నే పరిహసిస్తున్న నేతల మధ్య అధికార పార్టీ అల్లకల్లోలమవటం రాష్ట్రప్రజల పాలిట శాపంగా మారింది. సమాజంలో చైతన్యం లేకుండా కేవలం వారిని తాయిలాలతో, మద్యం మత్తులో కొనసాగించటం, రాజకీయ స్పృహ పెరగకుండా చేయటం వల్ల అంతా గందరగోళం నెలకొంది. వేగంగా ఎదిగేందుకు అన్ని అవకాశాలూ ఉన్నప్పటికీ వ్యవస్థీకృత లోపాల వల్ల నెమ్మదిగా అభివృద్ధిని సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఈ కల్లోలం వల్ల అధ్వాన్నంగా తయారైంది. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజల్ని పావులుగా తప్ప రాజకీయాలలో, పాలనలో భాగస్వాములుగా చేయకపోవటం వల్ల ఈ అనర్థదాయక పరిణామాలు చోటుచేసుకున్నాయి. నాయకత్వం కేవలం ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే అది నియంతృత్వమే అవుతుంది తప్ప ప్రజాస్వామ్యం అనిపించుకోదు. బలమైన నాయకుడిగా రాజశేఖర రెడ్డి బతికుంటే తన లోపాల్ని, తద్వారా రాష్ట్రానికి జరుగుతున్న అనర్థాన్ని దిద్దుకునేవారేమో. ఎందుకంటే, ఆయన మరణించటానికి ముందురోజు అసెంబ్లీలో జలయజ్ఞంలోని అసంబద్ధ పథకాల వల్ల ఖజానాకు వస్తున్న నష్టం గురించి నేను తీవ్రంగా ప్రశ్నించాను. కటువుగా విమర్శించాను. మాట్లాడాక నేరుగా ఆయనకు కూడా వైఫల్యాల్ని వివరించాను. కొన్ని నిమిషాలు కళ్లు మూసుకుని తర్వాత మాట్లాడుతూ, తప్పకుండా అసంబద్ధ పథకాలను పునస్సమీక్షిస్తానని, తప్పులు సరిచేసుకుంటామని హామీ ఇచ్చారు. కాని జరిగిన పొరపాట్లని సరిదిద్దే అవకాశం లేకుండానే ఆయన హఠాత్తుగా మరణించారు.

## నూతన రాజకీయ ప్రత్యామ్నాయం, కొత్త అభివృద్ధి నమూనాతోనే మార్పు

రాష్ట్రాన్ని ఈవేళున్న సంక్షోభంలోకి నెట్టిన సాంప్రదాయ

రాజకీయ పార్టీల (సా.రా పార్టీల)కు భిన్నంగా ఒక నూతన ప్రత్యామ్నాయ రాజకీయాన్ని, పేదరికాన్ని నిర్మూలించి, జనం చేతికి అధికారాన్నిచ్చే కొత్త అభివృద్ధి నమూనాను తీసుకురావటం ద్వారా మాత్రమే రాష్ట్రంలో మేలుమార్పును సాధించుకోగలం.

**ఇందుకోసం...** 1) కొత్త రాజకీయ సంస్కృతిని తీసుకురావాలి 2) జనం చేతికి అధికారం ఇవ్వాలి 3) నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలను అందించాలి 4) స్వతంత్ర ప్రతిపత్తిగల బలమైన అవినీతి నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేయాలి 5) వ్యవసాయాన్ని లాభసాటి చేసే చర్యలు చేపట్టాలి 6) హేతుబద్ధ భూసేకరణ, పారిశ్రామిక విధానాల అమలు 7)చట్టబద్ధమైన పాలన అందరికీ సమానంగా వర్తించేలా చేయటం - అవసరం

## 1) కొత్త రాజకీయ సంస్కృతి

అధికారమే ఏకైక లక్ష్యంగా పనిచేసే రాజకీయం స్థానంలో హేతుబద్ధమైన సామాజిక- ఆర్థిక విధానాలు, పౌరులు కేంద్రంగా పాలన, జాతీయత, సెక్యులరిజం, నైతికత ప్రాతిపదికన కొత్త రాజకీయ సంస్కృతిని ప్రవేశపెట్టాలి. బంద్‌లు, రాస్తారోకోలతో జనజీవితాల్ని అస్తవ్యస్తం చేసే ఆందోళనాపద్ధతులకు స్వస్తిపలికాలి. చట్టబద్ధ పాలనను నిక్కచ్చిగా అమలుచేయాలి.

ఈ క్రమంలో నేరపరిశోధనా వ్యవస్థలో రాజకీయ జోక్యాన్ని తొలగించేలా పోలీసు సంస్కరణల్ని తీసుకురావటం తక్షణావసరం. పోలీసు నియామకాల్లో ప్రమాణాల్ని పెంచి విధి నిర్వహణలో పూర్తి బాధ్యతాయుత వ్యవహారశైలిని తీసుకురావాలి.

## 2) జనం చేతికి అధికారం

అధికారాన్ని వికేంద్రీకరించి జిల్లా ప్రభుత్వాలను, మున్సిపల్/కార్పొరేషన్, మండల, గ్రామపంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దటం, ప్రతి పౌరునికీ తలసరి రూ.1000 కేటాయించి ఎన్నుకున్న కమిటీల ద్వారా స్థానిక సమస్యల్ని పరిష్కరించుకునే ఏర్పాటు చేయటం ద్వారా జనం చేతికి అధికారం ఇవ్వటం తక్షణావసరంగా గుర్తించాలి.

దాంతోపాటు పేదరిక నిర్మూలన, అవినీతి రహిత పాలన, రాజకీయ ప్రాతినిధ్యం ఉండేలా వ్యవస్థీకృత ఏర్పాట్లు చేసి జిల్లా, పట్టణ, గ్రామస్థాయికి పాలనను వికేంద్రీకరించటం తప్పనిసరి.

అయితే రాష్ట్రానికి మహారాజులా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి, నియోజకవర్గాలకు పెత్తందారులుగా మారిన ఎమ్మెల్యేలు, ఈ నిర్ణయాన్ని అమలు చేయటానికి ఎంతమాత్రమూ అంగీకరించరు. తమ పెత్తనం పోతుందని ఉన్నతాధికారులు కూడా అడ్డం పడుతుంటారు. కానీ అవినీతిని శాశ్వత ప్రాతిపదికన నియంత్రించటానికి, ప్రజలు హింస వైపు మళ్లకుండా ప్రజాస్వామ్య పాలనలో భాగస్వాములయ్యేలా చేసేందుకు వికేంద్రీకరణ తప్ప వేరే మార్గం లేదు.

రాజ్యాంగం 11, 12వ షెడ్యూళ్లలో పేర్కొన్న 'స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదిలీ'ని తప్పనిసరిగా చేయాలి. రాష్ట్రానికున్న విచక్షణాధికారాన్ని తొలగించాలి. ఎంపీలకు, ఎమ్మెల్యేలకు స్థానిక ప్రభుత్వాల్లో ఎటువంటి పాత్రా ఉండకూడదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఉండేలా ఎన్నికైన జిల్లా కౌన్సిళ్లు ఉండాలి. జిల్లా కలెక్టర్‌ను కౌన్సిల్‌కు కార్యదర్శిగా చేయాలి. ఈ అధికార వికేంద్రీకరణ అంటే అవినీతి వికేంద్రీకరణ కాదు. అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేర్చే విప్లవాత్మక మార్పుగా గుర్తించాలి. వివిధ రంగాలకు చేసిన కేటాయింపులు, చివరికి చట్టాలు సక్రమంగా అమలవ్వాలన్నా అధికార వికేంద్రీకరణ లేకుండా సాధ్యం కాదు. కేంద్రీకృత పాలన నడుపుతూ ఉచిత కలర్ టీవీలు, నెలకు ఉచితంగా రూ.2000 డబ్బు వంటి పథకాలను ప్రవేశపెట్టటం వల్ల ప్రజలకు మేలుజరగదు. మద్యం వంటి దీర్ఘకాలిక విషతుల్య సమస్యను పరిష్కరించటానికి కూడా వికేంద్రీకరణే మార్గం. మద్యం దుకాణాల నియంత్రణాధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు అప్పచెబితే సమర్థవంతంగా పరిష్కరించవచ్చు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదిలీ వల్ల తమ ప్రాభవం తగ్గుతుందని రాష్ట్రాలు భయపడనక్కర్లేదు. పైస్థాయి నుంచి రాష్ట్రాలకు అధికారాలు బదిలీ వల్ల భారత ప్రభుత్వానికి పలుకుబడి తగ్గలేదు సరికదా పెరిగింది. స్థానిక ప్రభుత్వాలకు బాధ్యతలివ్వటం వల్ల రాష్ట్రాలు ఇతర కర్తవ్యాల మీద దృష్టి పెట్టవచ్చు. ఇదేసమయంలో జనం చేతికి నేరుగా అధికారాన్ని ఇచ్చేందుకు బడ్జెట్ నుంచి సుమారు 10శాతం నేరుగా ప్రజలకు కేటాయించాలి. తలసరి కనీసం రూ.1000 ప్రతి పౌరునికీ కేటాయించి వారు ఎన్నుకున్న కమిటీల ఆధ్వర్యంలో ఆ డబ్బును ఖర్చు చేసుకునే ఏర్పాటు చేయాలి. ఇలా చేయటం వల్ల వెయ్యిమంది జనాభా ఉన్న గ్రామానికి ఏటా రూ.10లక్షలు

వస్తాయి. స్థానికంగా వారి సమస్యల పరిష్కారానికి ఎవరి కోసం ఎదురుచూడకుండా వెంటనే పరిష్కరించుకోగలుగుతారు. పరిపాలన గురించి కూడా ప్రజల్లో సమగ్ర అవగాహన ఏర్పడి ప్రజాస్వామ్యం వికసిస్తుంది. దిగువస్థాయిలో తప్పులు జరిగితే తగిన చర్యలకు పైన అంబుడ్స్‌మన్ వంటి వ్యవస్థల్ని ఏర్పాటుచేయవచ్చు.

## 3) అవినీతి నిర్మూలనకు స్వతంత్ర ప్రతిపత్తిగల బలమైన వ్యవస్థ ఏర్పాటు

అవినీతి కుంభకోణాల్ని వెలికితీయాలంటే కోర్టుల్ని ఆశ్రయించటం మినహా వేరే మార్గంలేదనే పరిస్థితి ఈవేళ నెలకొంది. ఎవరు ఏ స్థాయిలో అవినీతికి పాల్పడినా వారికి కఠినశిక్షతోపాటు, వారి ఆస్తుల్ని జప్తుచేసేరీతిలో స్వతంత్ర ప్రతిపత్తి గల పటిష్ట అవినీతి వ్యతిరేక వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలి.

కోరలు లేకపోవటం వల్లే మన రాష్ట్ర లోకాయుక్త పైస్థాయి అవినీతిని అడ్డుకోలేకపోతోంది. కనీసం కర్నాటకలోని లోకాయుక్తకు ఉన్నట్టు కూడా ఆంధ్రప్రదేశ్‌లోని లోకాయుక్తకు అవినీతిపరులపై దాడులు నిర్వహించి, చర్యలు తీసుకునే అధికారం లేదు. కర్ణాటకలో ఆ రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) లోకాయుక్త వ్యవస్థలోనే అంతర్భాగంగా ఉంది. అందువల్ల మన రాష్ట్రంలో లోకాయుక్తకు అధికారాల్ని, నిధుల్ని, సిబ్బందిని ఇచ్చి పూర్తిగా బలోపేతం చేయటంతోపాటు ఏసీబీ, విజిలెన్స్ సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి లోకాయుక్త పరిధిలోకి తెచ్చి అవినీతిపరులు ఏ స్థాయిలో ఉన్నా చర్యలు తీసుకునే ఏర్పాటు చేయాల్సుంది.

ఇందుకోసం విధిగా అవినీతి నిరోధక చట్టం, 1988ను సవరించి ఈ దిగువ చర్యలను చేపట్టాలి...

1. అవినీతి నిరోధక చట్టం 1988ను విధిగా సవరించాలి. అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ)కి, విజిలెన్స్ విభాగానికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతినిధులందరినీ ప్రజాసేవకుల పరిధిలోకి తెచ్చి అవినీతి నిరోధక చట్టం కింద విచారణ చేపట్టాలి.

2. ఏసీబీలోని ఉన్నతస్థాయి నియామకాల్ని చేసేందుకు, ఆ సంస్థ స్వతంత్రంగా వ్యవహరించేందుకు, అవినీతిని అదుపు చేసేందుకు స్వతంత్రనిర్వహణకి అనువైన ఏర్పాట్లు చేయాలి.

3. అవినీతి కేసుల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలి. హైకోర్టు సిఫార్సు మేరకు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హోదా కలిగిన స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాసిక్యూటర్‌ను కేసుల విచారణకు నియమించాలి.

4. అవినీతి నేరం రుజువైతే ఆస్తుల్ని జప్తు చేయాలి.

5. ఏసీబీ, విజిలెన్స్‌తోపాటు క్రమశిక్షణ చర్యల ట్రైబ్యునల్, ప్రజాసేవకుల విచారణ చట్టం, కమిషనరేట్ ఆఫ్ ఎంక్వయిరీస్ తదితర అవినీతి దర్యాప్తు వ్యవస్థలన్నిటినీ కోరలున్న లోకాయుక్త పరిధిలోకి తెచ్చి ఏకీకృతంగా వ్యవహరించే ఏర్పాటు చేయాలి. ముఖ్యమంత్రిని జాతీయస్థాయిలోని లోక్‌పాల్ వ్యవస్థ పరిధిలోకి తేవాలి.

... ప్రభుత్వంతోపాటు అవినీతి నిర్మూలన కోసం పదేపదే మాట్లాడుతున్న పార్టీలు ప్రజాగ్రహం తమను కబళించకముందే అవినీతి నిరోధక చట్ట సవరణకు రాజకీయాలకతీతంగా కలిసి వచ్చి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి.

అవినీతిపరులపై కఠినచర్యలను చేపట్టటంతోపాటు పెద్దఎత్తున అవినీతికి పాల్పడే అవకాశం లేకుండా, కాలక్రమంలోనైనా అవినీతికి ఆస్కారం లేకుండా ఉండేందుకు అధికారాన్ని జిల్లా, పట్టణ, గ్రామస్థాయి వరకూ వికేంద్రీకరించటం అవసరం. ఒకమేర దాటి ప్రకృతి వనరుల నుంచి లాభాలను ఆర్జించే వీలులేకుండా విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్ను విధించాలి. వీటితోపాటు రాజకీయ, ఎన్నికల వ్యవస్థల్ని ప్రక్షాళన చేసినప్పుడే అవినీతిని సమగ్రంగా నియంత్రించగలం.

## 4) అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు

ఎలా అధికారంలోకి రావాలి అని తప్ప ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలైన డబ్బును ఎలా సద్వినియోగం చేయాలి, ఎలాంటి ప్రాధమ్యాలు ఉండాలి అనే చర్చ ఇకనైనా మన రాజకీయాల్లో లోతుగా ప్రారంభం కావాలి. ఈ విషవలయాన్ని ఛేదించాలంటే అందరికీ మంచి ప్రమాణాల విద్యను, ఆరోగ్యాన్ని ఉచితంగా అందించే ఏర్పాటును ప్రభుత్వం తొలి ప్రాధమ్యం చేసుకోవాలి. అందుకోసం అవసరమైన నిధుల్ని కేటాయిస్తేనే ప్రజల పన్నుల డబ్బును సద్వినియోగం చేసినట్టు. ఇది కొత్తగా గుర్తించిన వాస్తవమా అంటే అదీ కాదు. టీవీలు, మిక్సీలు, మద్యం సీసాలు కాకుండా విద్య, ఆరోగ్యం

వంటి మెరిట్ సేవలకు ఉచితాల్ని, రాయితీల్ని ఇవ్వాలి. విద్య ఆరోగ్యాలకి పెద్దపీట వేయకుండా పిల్లలకు అంగవైకల్యం రాకుండా పిల్లలకు వేయాల్సిన టీకాలకు డబ్బు ఉండదు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను, బిడ్డల భవిష్యత్తును తాకట్టుపెట్టి మరీ తెచ్చిన డబ్బును ఒకరూపంలో ఖర్చు చేస్తే, మరో కార్యక్రమానికి, లేదా రంగానికి డబ్బులు తగ్గుతాయి. ఉదాహరణకి కలర్ టీవీల బదులు పిల్లల చదువుకు, కుటుంబ ఆరోగ్యానికి వెచ్చించటం ముఖ్యం. నిరుద్యోగ యువతకి ఉచితంగా నెలనెలా డబ్బిచ్చే బదులు, ఆ యువతకే ఉపాధికి కావలసిన నైపుణ్యం అందించటానికి, ఉపాధి కల్పన కోసం ఏర్పాటుచేయవలసిన మౌలిక సదుపాయాలకి కేటాయిస్తే బీదరికం తగ్గుతుంది. కేవలం కొన్ని వ్యాధులకు, కొన్ని దశల్లో ఉపయోగపడే స్కీము కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తే, ఈ రాష్ట్రంలోనే పుట్టుకతో అంగవైకల్యానికి, గుండెజబ్బులకి బలికాకుండా వేలాదిమంది బిడ్డలని రక్షించుకోవటానికి అవసరమైన టీకాలని తల్లులకివ్వలేం. ఫ్లోరోసిస్ వ్యాధికి గురయ్యే 20లక్షల జనాభాకి ఫ్లోరైడ్‌లేని మంచినీరు అందించలేం. ఆర్థికభారాన్ని మోయలేక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేందుకు భయపడి అనారోగ్యంతో ఇంటి వద్దే నిస్సహాయంగా భరిస్తున్న లక్షల మందికి ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వ వైద్యశాలల్ని పటిష్టం చేయలేం. కాబట్టి అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి నైపుణ్యాల శిక్షణను ప్రభుత్వమే ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేయాలి. ఈ మెరిట్ సేవలకు పెద్దపీట వేశాక వ్యక్తులకు ఇచ్చే రాయితీలను సర్దుబాటు చేయాలితప్ప వీటిని ఎంతమాత్రం ఫణంగా పెట్టకూడదు.

ఏ కులంలో, ఏ మతంలో, ఏ కుటుంబంలో పుట్టినా 12వ తరగతి వరకూ నాణ్యమైన ఉచిత విద్యను ప్రభుత్వమే అందించాలి. ఆ తర్వాత పేదరికం కారణంగా ఎవరికీ పైచదువులు ఆగకుండా ప్రభుత్వమే తోడ్పాటునివ్వాలి. వాస్తవానికి అణగారినవర్గాలకు చెందినవారిలో 90శాతం మంది చదువులు పాఠశాలస్థాయిలోనే ఆగిపోతున్నాయి. వారికి పాఠశాల స్థాయిలో ఉచితంగా ఇవ్వకుండా కేవలం పైచదువుల గురించి మాట్లాడటం వల్ల ఫలితం ఉండదు. ఇందుకు విద్యాహక్కు చట్టాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. 12వ తరగతి వరకూ ఉచితంగా ఇస్తే ప్రతి పేదింటి బిడ్డా పైకి వచ్చే ఏర్పాట్లు పటిష్టమవుతాయి. అలాగే ప్రాథమిక స్థాయి నుంచి తృతీయస్థాయి వరకూ ఏ రకమైన జబ్బు వచ్చినా, ఏ ఆసుపత్రిలోనైనా ఉచితంగా సేవలు పొందే హక్కును కల్పించాలి. దాంతోపాటు ఉపాధి నైపుణ్యాలకు ఉచిత శిక్షణను ఏర్పాటు చేయాలి. అధికారాన్ని వికేంద్రీకరించి, చిన్న పట్టణాల అభివృద్ధిని చేపట్టి ఉపాధి అవకాశాల్ని పెంచాలి. జనం చేతికి అధికారాన్నిచ్చి నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి సేవలు సక్రమంగా అందించే ఏర్పాట్లు చేయాలి. ఇవి తప్ప పేదరికాన్ని పోగొట్టటానికి వేరే చిట్కాలేవీ లేవు. గోతులు తవ్వి పూడ్చటం వంటి ఉపాధి హామీలతో పేదరికం పోదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత, గత శతాబ్దంలో మనలాగే ఎన్నో సమస్యల్ని ఎదుర్కొన్న దేశాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలను ప్రజలకు అందించటం ద్వారానే అభివృద్ధిని సాధించాయి. ఏడాదికి కేవలం రూ. 2500కోట్లతో నైపుణ్యాల శిక్షణను ప్రారంభిస్తే ఏటా 10లక్షలమంది యువతకు ఉపాధిని కల్పించవచ్చు.

**ఏ కులంలో, ఏ మతంలో, ఏ కుటుంబంలో పుట్టినా 12వ తరగతి వరకూ నాణ్యమైన ఉచిత విద్యను ప్రభుత్వమే అందించాలి. ఆ తర్వాత పేదరికం కారణంగా ఎవరికీ పైచదువులు ఆగకుండా ప్రభుత్వమే తోడ్పాటు నివ్వాలి.**

మంచి ప్రమాణాలు గల విద్య, వైద్యం, ఉపాధి నైపుణ్యాల్ని అందరికీ గ్యారంటీ చేసి మానవ వనరుల్ని అభివృద్ధి చేసి చిన్నపట్టణాల్లో ఉపాధి అవకాశాల్ని మెరుగుపరిచి పేదరికాన్ని శాశ్వతంగా పారదోలాలి.

## 5) వ్యవసాయాన్ని లాభసాటి చేయటం

రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు తగిన తోడ్పాటునందించటం తద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయటం. ప్రతి గ్రామానికీ ఒక అగ్రిక్లినిక్, రైతుల అధీనంలో మార్కెట్‌యార్డులు, ఆస్తి విలువ ఆధారంగా రుణసౌకర్యం కల్పించటంతోపాటు రైతులు తమ ఉత్పత్తుల్ని ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ అమ్ముకునేలా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయటం. 1000 చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పటం.

రాష్ట్రంలోపల, దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా డిమాండ్ ఉన్న చోట స్వేచ్ఛగా అమ్ముకునేందుకు శాశ్వతంగా ఏర్పాట్లు చేయటం తక్షణావసరం. అలాగే ప్రపంచ మార్కెట్లో స్వేచ్ఛా వాణిజ్యానికి ఎగుమతులకు అనుమతివ్వాల్సిందిగా భారత ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సి ఉంది. ఇప్పుడు అమలుచేస్తున్న కనీస మద్దతు ధర చాలా అసమగ్రంగా రూపొందించారు. ఇది గరిష్ట ధరగా మారిపోయి రైతుల పాలిట శాపంగా మారింది. ఈ పరిస్థితుల్ని సరిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి కృషి చేయాలి. తక్కువ ధరకు ఉత్పత్తి చేయటం వల్ల భారతీయ రైతు అంతర్జాతీయ మార్కెట్లో మంచి లాభాలను ఆర్జించవచ్చని చెబుతూ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.వొ)లో భారత్ చేరటాన్ని 1990లలో అప్పుడు ఆర్థిక, వాణిజ్యమంత్రులుగా ఉన్న డా॥ మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ సమర్థించిన విషయాన్ని, ఆ మేరకు పార్లమెంటుకు హామీ ఇచ్చిన విషయాన్ని లేవనెత్తి భారత ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సుంది.

ఆహారధాన్యాల ఎగుమతితోపాటు కొంతమేర నిల్వ ఉండే ఉత్పత్తులకు స్టోరేజీలు ఏర్పాటు చేసి ధర లభించినప్పుడు అమ్ముకునే ఏర్పాటుచేయటం, ఏమాత్రం నిల్వ ఉండని పంటలకు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయటం, చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించటం అవసరం. ఏ పంటలు వేయాలి, ఎరువుల మోతాదు, భూసార పరీక్షలు తదితర సేవలకు అగ్రిక్లినిక్‌లను ఏర్పాటు చేయాలి, రుణసౌకర్యాన్ని పటిష్టంగా రైతుకు చేరువ చేయాలి. అప్పుడే వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తద్వారా రాష్ట్ర ఆర్థికవ్యవస్థను మెరుగుపరుచుకోగలం. రైతులు కులాలు, ప్రాంతాలు, పార్టీలు, పంటల పేరుతో విడిపోవటం పాలకులకు బాగా కలిసివస్తోంది. రైతుల్ని విడగొట్టటానికి వారు శాయశక్తులా ప్రయత్నిస్తుంటారు. రైతులు వాటన్నిటినీ అధిగమించి రాజకీయాలకు అతీతంగా ఏకమై పోరాడితేనే వ్యవసాయానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు విముక్తి లభిస్తుంది. పారిశ్రామికరంగం కూడా అభివృద్ధి చెందుతుంది.

**ఎవరూ పెద్ద త్యాగాలు చేయనక్కర్లేదు, కానీ మౌనప్రేక్షకుల్లా చూస్తూ కూర్చోకుండా తమ శక్తియుక్తులన్నిటితో పనిచేయాలి.**

## 6) హేతుబద్ధ భూసేకరణ, పారిశ్రామికాభివృద్ధి విధానాలు

నీటిపారుదల ప్రాజెక్టులు, పారిశ్రామికాభివృద్ధి, విద్యుత్ కేంద్రాలు, సెజ్‌లు, తదితర ఆర్థికాభివృద్ధి సాధనాలకు భూసేకరణలకు పర్యావరణం, స్థిరమైన అభివృద్ధి, నిర్వాసితులకు మెరుగైన జీవనం ప్రాతిపదికన హేతుబద్ధ విధానాలను రూపొందించాలి. కోల్పోయిన భూమికి నిజమైన మార్కెట్ ధరతో పాటు, అవసరమైన భూమికన్నా రెట్టింపు సేకరించి, దాన్ని అభివృద్ధి పరచి, మళ్ళీకోల్పోయిన భూమిలో సగాన్ని రైతులకందిస్తే పెరిగే విలువఉన్న ఆస్తిని రైతులు పొందుతారు. ఆపైన రైతుల పిల్లలకి శిక్షణనిచ్చి విదిగా ఉపాది వారికి అందే ఏర్పాటుచేస్తే పారిశ్రామికీకరణకోసం భూములనివ్వటానికి రైతులు సిద్ధపడతారు.

## 7) చట్టబద్ధపాలన

ఈరోజున మన రాష్ట్రంలో చట్టం ఉన్నవాడికి చుట్టం అయ్యింది. బడితే ఉన్నవాడిదే బర్రె అనే చందంగా పాలన తయ్యారయ్యింది. కులంతో, డబ్బుతో, పదవితో, పలుకుబడితో నిమిత్తం లేకుండా చట్టాలు, నిబంధనలు అందరికీ సమానంగా వర్తించే వ్యవస్థని నిర్మాణం చేసినపుడే ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది.

... వీటన్నిటినీ సాకారం చేసే బాధ్యతను రెక్కాడితే డొక్కాడని సామాన్య ప్రజల మీద వోపటం ఆత్మవంచనే అవుతుంది. సమాజంలో కాస్త వనరులు, ఆలోచనాశక్తి కలవారు, మీడియా ఈ బాధ్యతను తీసుకోవాలి. వారితో యువత, మధ్యతరగతి కలిసిరావాలి. ప్రపంచంలో ఏ మూలనున్నా తెలుగువారంతా కదలాలి. మీడియా యాజమాన్యాలు ఎలా ఉన్నా జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని విస్మరించకూడదు. కేవలం వార్తల్ని తాజాగా రాయటమో, ప్రసారం చేయటమో మాత్రమే తమ పనికాదు, సామాజిక మార్పును తెచ్చేందుకు తాము బాధ్యత తీసుకుని అలాంటి శక్తులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మీడియావారు గుర్తించాలి. ఎవరూ పెద్ద త్యాగాలు చేయనక్కర్లేదు, కానీ మౌనప్రేక్షకుల్లా చూస్తూ కూర్చోకుండా తమ శక్తియుక్తులన్నిటితో పనిచేయాలి. అలా మధ్యతరగతి, మీడియా, నాయకత్వాన్నిచ్చే శక్తి, విశ్వసనీయత ఉన్న వ్యక్తులు సమిష్టిగా, చిత్తశుద్ధితో కృషి చేస్తేనే రాష్ట్రం ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి శాశ్వత అభివృద్ధి పథంలో సాగుతుంది.

'తానా' (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) నిర్వహిస్తున్న సదస్సుకు, ప్రవాస తెలుగువారందరికీ 'తెలుగు పలుకు' సావనీర్ ద్వారా నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ... ◆

# బ్రతుకు పోరాటం

- కొంగర గంగాధరరావు

**సాయుధ పోరాటం అంటాడు ఒకడు**
**ఆత్మాహుతి దళం అంటాడు మరొకడు**
**సీమసైన్యం అంటాడు ఇంకొకడు**

వీళ్ళు మన ఎమ్మెల్యేలు. మంత్రులు. వీళ్ళని మనం ఓట్లు వేసి మరీ ఎన్నుకున్నాం. కాని వీళ్ళు మన ప్రతినిధులుగా మన సమస్యలను గాలికొదిలేశారు. ఒకడు ప్రత్యేక తెలంగాణ అంటాడు. మరొకడు సమైక్యాంధ్ర అంటాడు. ఇంకొకడు సీమసంగతి తేల్చమంటాడు. అసలింతకీ రాష్ట్రంలో ఇవి తప్ప మరే సమస్యలూ లేవా?

తెలంగాణ కావాలనే వాడు తెలంగాణలో అన్ని పక్షాలను కలుపుకుపోడు. ఎవడికి వాడు తెలంగాణ వస్తే తన ద్వారానే రావాలని, తనకే ఆ క్రెడిట్ దక్కాలని ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నాడు. నిజంగా తెలంగాణ వస్తే భవిష్యత్ తెలంగాణ కుక్కలు చింపిన విస్తరి అవుతుందేమోనన్న భయం కలుగకమానదు.

తెలంగాణ రాగానే బ్రతుకు కష్టాలన్నీ తీరిపోతాయని అరిచేతిలో స్వర్గం చూపిస్తున్న అరివీర భయంకరులైన ఈ నాయకులు రేపు తెలంగాణ వస్తే, ప్రజలకు కల్పించిన ఆశలకు అనుగుణంగా వారిని అభివృద్ధి పథంలో నడిపించగలరా? లేనట్లయితే ప్రజల్లో కలిగే నిరాశా నిస్పృహలు ఏ రూపుదిద్దుకుంటాయి? వారి తిరుగుబాటును తట్టుకునే నైతిక శక్తి వీళ్ళలో వుందా?

ఇక సమైక్యాంధ్ర కావాలనేవాడు ఎందుకు సమైక్యాంధ్రకావాలో చెప్పడు. విడిపోయి రెండు రాష్ట్రాలుగానో, మూడు రాష్ట్రాలుగానో వుంటే కలిగే నష్టమేంటో ఎంత ఆలోచించిన అర్థం కాదు.

ఇక సీమ సంగతి. రాజశేఖర్ రెడ్డి పుణ్యమా అని కడప కొంతవరకూ (సాగునీరు తదితరాలు) బాగుపడింది తప్ప సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో సీమ ప్రాంతానికి కలిగిన లాభాలేమిటి?

అసలామాటకొస్తే సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాంతం బాగుపడింది? మరెందుకు కలిసుండాలని, విడిపోవాలని తన్నుకుంటున్నారు? వాళ్ళు తన్నుకుంటున్నది కాక ప్రజలకు దాన్ని జీవన్మరణ సమస్యగా ఎందుకు మార్చారు?

అభివృద్ధి పథంలో హైదరాబాదు వున్న మాట వాస్తవం. విశాఖ కూడా అభివృద్ధి చెందినా దాన్ని హైదరాబాదుతో పోల్చలేం. ఇవాళ ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం హైదరాబాదు నుండే వస్తోంది. కాబట్టే సీమాంధ్రులు విడిపోయేటట్లయితే ముందు హైదరాబాదు సంగతి తేల్చమంటున్నారు. కాని భౌగోళికంగా దాదాపుగా తెలంగాణ మధ్యలో వున్న హైదరాబాద్‌పై సీమాంధ్రులు హక్కును పొందజాలరు. ఇక అభివృద్ధిలో భాగస్వామ్యమంటే ఆ నగరాన్ని సీమాంధ్రులే కాదు, భారతదేశంలోని ఇతర రాష్ట్రాలను నుండి వచ్చిన వారు కూడా అభివృద్ధి చేశారు. కాకపోతే సంఖ్యలో, శాతంలో తేడా వుండవచ్చు.

కాని పుట్టిన ఊరిని కాదనుకుని వున్న పొలం పుట్ర అమ్ముకొని వచ్చిన డబ్బులతో రాష్ట్ర రాజధానిగా హైదరాబాదులో వ్యాపారమో, మరేదో చేసుకుంటూ అభివృద్ధి అవకాశాలను అంది పుచ్చుకున్న సీమాంధ్రులను ఈ నగరం మీది కాదు మీ రాష్ట్రం వేరు మా రాష్ట్రం వేరు, వుంటే నోరుమూసుకొని మాకు జై కొడుతూ మాతోపాటు బ్రతకండి లేనట్లయితే మీ దారి మీరు చూసుకోండి అంటే ఎంతటి ఉదారంగా ఆలోచించే వారికయినా కడుపుమండుతుంది. ఈ దుస్థితికి కారణం ఏమిటి?

అసలీ సమస్య అంతా రాష్ట్రంలోని మిగిలిన చిన్న నగరాలను అభివృద్ధి చేయకుండా, ప్రణాళికలను పెట్టుబడులను మొత్తం రాష్ట్ర రాజధానిగా హైదరాబాద్‌పై కేంద్రీకరించడంతో వచ్చింది. అలా కాకుండా అన్ని మండల కేంద్రాలను చిన్న పట్టణాలుగా అభివృద్ధి పరచి, ఉపాధి అవకాశాలను కల్పించివుంటే హైదరాబాదుకు రాష్ట్రం నలుమూలల నుండి ఈ వలసలు తగ్గేవి. హైదరాబాద్ ఎంతలా పెరిగినా, తాము పుట్టిన ఊరిని వదలాల్సిన అవసరం, హైదరాబాదు లేకపోతే తామేం అయిపోతామో అన్న భయం ప్రజలకు ముఖ్యంగా యువతకు వుండేది కాదు.

ఇప్పటికి కూడా హైదరాబాదును మరింత విస్తృత పరచడమెలా అన్న ప్రణాళికలను రచిస్తున్నారు తప్ప ప్రజలు వాళ్ళ మూలాలు వదలాల్సిన అవసరం లేకుండా కనీస మౌలిక

పౌర సదుపాయాలను కల్పించి చిన్న పట్టణాలను, మండల కేంద్రాలను అభివృద్ధి పరచాలన్న ఇంగితజ్ఞానం ప్రభుత్వాలకు ప్రణాళికాధికారులకు లేకుండా పోతోంది.

కలిసుండాలా, విభజించాలా అన్న సమస్యను మనమెలాగూ పరిష్కరించుకోలేం కాబట్టి ఎంత మొత్తుకున్నా ఆ ప్రాప్త కాలజ్ఞత తెచ్చుకోకుండా ఇంకా ఇంకా విద్వేషాలను రెచ్చగొట్టుకుంటూ పోతున్నారు కాబట్టి కాగల కార్యం గంధర్వులు తీరుస్తా రన్నట్లుగా ఆ సమస్యను ఢిల్లీకి వదలివేసి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఇకనైనా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధిపైనా దృష్టిపెట్టి, మాటల్లో కాకుండా చేతల్లో ఈ రాష్ట్రాన్ని నిరాశా నిస్పృహలలో నుండి గట్టెక్కించాలి.

కలిసున్నా లేక విడిపోయినా, అది త్వరలోనే లేదా చాలా కాలం తర్వాత తేలినా, కలిసుంటే ఇప్పటి రాష్ట్రంలోని లేదా విడిపోతే అప్పటి రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలు సమతూకంగా అభివృద్ధి అవకాశాలతో ప్రజలను సంతృప్తి పరచినప్పుడే ఇటువంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. లేనట్లయితే నివురుగప్పిన నిప్పులా పరిష్కారాలు వెదకినా ఈ సమస్య ఒకరూపంలో కాకపోతే మరో రూపంలో ఉద్భవిస్తూనే వుంటుంది. **ఎందుకంటే ఇది ప్రజల బ్రతుకు పోరాటం కాబట్టి.**

## వైద్యరంగంపై ప్రత్యేక సంచిక

### పాఠకులకు, ప్రకటన కర్తలకు విజ్ఞప్తి

**వైద్యరంగం పై ప్రత్యేక సంచికను విలువైన సమాచారంతో అందించడానికి ప్రయత్నిస్తున్నాం. దేశ, విదేశీ సమాచారం తోపాటు, విశ్లేషణాత్మక వ్యాసాలతో, అందరికీ ఆరోగ్యం అందించే వివిధ ప్రయోగాలు, విధానపరమైన అంశాలతో రూపొందిస్తున్నాం. దీనికి కొంత వ్యవధి అవసరం అయినందున గతంలో ప్రకటించినట్టు కాకుండా ఆగస్టు 16-31 పత్రికను ప్రత్యేక సంచికగా వస్తుంది. దీనిని పాఠకులు, ప్రకటన కర్తలు సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాం.**

**ఇంకా ప్రకటనలు, సమాచారం పంపించే వారు ఆగస్టు 12వ తేదీలోగా అందేలా పంపించవలసిందిగా, ఈ ప్రత్యేక సంచికకు మీ తోడ్పాటును అందించవలసిందిగా కోరుతున్నాం.**

## వామన కవితలు



జంతువు మనిషిగా
మారితే ఎంత ప్రమాదం?
డబ్బు తినును

ప్రజలు వేరు
ప్రగతి వేరు
ప్రగతి పెద్దలది

తళుకు తాత్కాలికం
మెరుపు క్షణికం
నిలిచేది కలినం

చివరికి నెగ్గేది న్యాయం
ముందు నెగ్గేది మోసం

పుట్టుకలో ఒంటరి
చావులో ఒంటరి
బతుకులో కలిసికట్టు మనుషులు

దీపంలా వెలుగు
మేఘంలా కరుగు
జీవితం ధన్యం

మాట మెల్లగా అనాలి
పని పదునుగా చెయ్యాలి
మనిషి కార్యశీలి కావాలి

హాల్లో 'చిత్ర' హింస
ఇంటిలో టీవీ హింస
హింసే ప్రేక్షకుడి బతుకు

ధైర్యే 'స్వాహాయే' లక్ష్మి

కళ్ళు చూడడానికి
చెవులు వినడానికి
విచక్షణ మనుసుది

ఆకులు ఎన్నో
పూలు, పళ్ళు కొన్నే
ఫలితాలు పరిమితం

సైన్స్ డెమోక్రాట్ కాదు దాన్ని
ఓటింగ్‌తో నెగ్గించలేం

విత్తు మొలిస్తే పంట
ధర లేకుండా మంట

రిటైర్మెంట్ 58 కే
రెండేళ్ళు డిస్కౌంటు

చుక్కలకీ పవర్ కట్
పగలు వెలగవు

రుచి చూస్తే లవణం
తరచి చూస్తే సముద్రం

పులి అడవికి రాజు
పనివాడు ప్రపంచానికి రాజు

తలపులు తేలిక
చేతలు కష్టం
విజయాలు మరీను

**చిరునామా :**
జి2 మణిమాల ఎస్టేట్,
151 మోతీనగర్, హైదరాబాద్ - 18
ఫోన్ : 23833798, 23833799

# అవినీతి అంతు చూద్దాం - మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం

## చిత్తూరులో విద్యార్థులతో జేపీ ముఖాముఖి

***డా॥ జయప్రకాష్ నారాయణ్ చిత్తూరులో యువతకు పద నిర్దేశనం చేశారు... ఆయన చెప్పే ఒక్కొక్క మాట.. ఒక స్ఫూర్తిమంత్రం... ఉత్తేజితమైన వ్యాఖ్యలను దిక్సూచిగా చేసుకుని సాగిపోండి..***

◆ యువతకు ఆదర్శాలు, ఆలోచనలు లేవని, ఉన్నదంతా ఆవేశమని చెప్పే పెద్దల మాటలు పూర్తిగా తప్పు..

◆ నేటి యువతకు స్పష్టమైన లక్ష్యం ఉంది.

◆ రగిలే కాంక్ష ఉంది.

◆ దీనిని సక్రమ మార్గంలో పెట్టాల్సింది పెద్దలే..

◆ అవినీతి గురించి బోధించే పరిస్థితుల్లో.. నియంత్రించే వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేయాలి.

◆ కేవలం కేంద్రంలోనే లోక్‌పాల్ ఏర్పాటువల్ల ప్రయోజనం ఉండదు. రాష్ట్రస్థాయిల్లో లోకాయుక్త జిల్లాల్లో అంబుడ్స్‌మెన్ నియామకం వల్లనే చాలా వరకు నియంత్రించేందుకు వీలు కలుగుతుంది.

◆ దేశంలో పెచ్చుమీరుతున్న అవినీతిని రూపుమాపేందుకు యువత నడుం బిగించాలి.

◆ అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేయండి.

◆ నిరుత్సాహం వద్దు.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంది.

◆ భవిష్యత్తు మీదే... పోరాడి సాధించుకోండి.

◆ సమాజంలో మౌలిక మార్పు రావాలి.

◆ ద్వేషాల్ని వీడండి. ఏ ప్రాంతం వారైనా తోటి వారికి ప్రేమను పంచండి.

**ప్రత్యూష : సార్.. మీరు ఐఏఎస్‌కు రాజీనామా చేసి, రాజకీయాల్లోకి వచ్చి ఏం సాధించారు?**

**జేపీ :** పూర్తిగా కాకపోయినా.. కొంతమేరకైనా సాధించాను. అన్ని వర్గాల ప్రజలు, మీలాంటి కోట్లాది మంది యువతను కలుసుకోగలిగాను. కేంద్ర ప్రభుత్వంలో సలహాదారునిగా ఉండి, సమాచార హక్కును స్వయంగా తయారుచేశారు. రేపో, మాపో జాతీయ న్యాయ కమిషన్ వస్తోంది, దీని వెనుకా నా కృషి ఉంది. అవి చాలవు, ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఈ ప్రస్థానం నాకు బోలెడు అనుభవాన్ని ఇచ్చింది. నేను ఆశావాదిని. మీలాంటి వారి తోడ్పాటు ఉంటే.. సమాజంలో మార్పు చూపిస్తా.

**తేజేష్ : మన జమాజంలో అవినీతిని రూపుమాపేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటే సత్ఫలితాలు వస్తాయి?**

**జేపీ :** ప్రపంచంలోని మిగిలిన దేశాలతో పోలిస్తే మనం దేశం చాలా నయం. మనం అవినీతిపరులం కాదు. కొందరి అవినీతి వల్ల సమాజం చెడిపోతోంది. మీరందరూ ఈ రుగ్మతని గట్టిగా ఎదుర్కొంటే సాధ్యమవుతుంది.

**రేఖా పద్మిని :** నమస్తే సార్! విద్యార్థులు రోల్ మోడల్‌గా పెట్టుకోవడం ఫలితాలను ఇస్తుందా?

**జేపీ :** స్ఫూర్తినిచ్చే వారిని రోల్ మోడల్‌గా పెట్టుకోవడంలో ఎటువంటి తప్పు లేదు. అయితే ఆదర్శనీయుల్ని మాత్రమే తీసుకోవాలి. అక్కడితోనే ఆగకూడదు. వారికంటే ఇంకా గొప్ప వ్యక్తులుగా ఎదిగేందుకు ప్రయత్నించాలి.

**నిరంజిని : విద్య అనేది నేడు వ్యాపార వస్తువుగా మారిపోయింది. ఉద్యోగాలు కూడా సిఫార్సులు ఉన్న వారికే లభిస్తున్నాయి కదా?**

**జేపీ :** నిరాశ చెందవద్దు. ఇది తాత్కాలికమే. ప్రతిభ ఉన్న వారికీ మన దేశంలో చోటు ఉంది. ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడు ఇటువంటివి రూపుమాపవచ్చు. ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఈ పరిస్థితి మారాలి.

ఇలా విద్యార్థులు సంధించిన ఎన్నో ప్రశ్నలకు లోక్‌సత్తా అధినేత జయప్రకాష్‌నారాయణ్ ఉత్సాహంగా జవాబులిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా లోక్‌పాల్, లోకాయుక్త బిల్లులపై అవగాహన పెంచే ప్రయత్నం చేశారు. ◆

# అవినీతి రహిత రాజకీయమే యువతకు లక్ష్యం కావాలి

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

దేశంలో విశృంఖలంగా మారిన అవినీతి మహమ్మారిని అంతం చేసి అందరికీ ఎదిగే అవకాశాలున్న కొత్త రాజకీయాన్ని సాధించే శక్తి జనాభాలో 71శాతం ఉన్న యువతకే ఉందని, యువత రాజకీయాల్లోకి వచ్చి కొత్త రాజకీయాన్ని ఒక కెరీర్‌గా మలచుకోవాలని జేపీ పిలుపునిచ్చారు. దేశాన్ని తీర్చిదిద్దేందుకు యువత, రైతులు, మహిళలకు లోక్‌సత్తా ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. జాతినిర్మాణం కోసం యువత, లోక్‌పాల్ బిల్లుపై జులై 22న శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో విద్యార్థులతో, యువతతో నిర్వహించిన చర్చాకార్యక్రమంలో జేపీ మాట్లాడుతూ... లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటు అవసరాన్ని, అవినీతి అంతానికి దాంతోపాటు తీసుకురావాల్సిన ఇతర చర్యల్ని కూడా వివరించారు. దేశంలో చోటుచేసుకున్న కుంభకోణాల మూలాలకు రాజకీయవ్యవస్థ ఎలా కారణమైందో వివరించారు. ప్రజల డబ్బును, వనరుల్ని దోచుకుంటే ఎంతటి వారినైనా జైల్లోకి పంపి వారి ఆస్తుల్ని జప్తుచేసే బలమైన లోక్‌పాల్ చట్టం రావాలని, అయితే అవినీతి ఎక్కువగా ఉండేది రాష్ట్రం, జిల్లాల స్థాయిలోనే కాబట్టి కేవలం జాతీయస్థాయిలో ఆ చట్టం వస్తే చాలదని, దేశానికి లోక్‌పాల్, రాష్ట్రానికి లోకాయుక్త, జిల్లాలకు అంబుడ్స్‌మన్ ఉండే మూడంచెల లోక్‌పాల్ చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. మరోపక్క కేవలం బలమైన చట్టం వచ్చినా రాజకీయ, పాలనావ్యవస్థల్ని ప్రక్షాళన చేయకుండా అవినీతిని నిరోధించటం సాధ్యంకాదని గుర్తుంచుకోవాలన్నారు. యువత ముందుకు కదిలితేనే ఇవన్నీ సాధ్యమవుతాయన్నారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అవినీతిపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. దోపిడీ, వారసత్వ రాజకీయాలకు అలవాటుపడ్డ నేతలు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తూ యువత భవిష్యత్తును చిదిమేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన



న్యాయమూర్తుల్లో కూడా అవినీతిపరులు ఉన్నారని తాను ఢిల్లీలో బహిరంగంగానే చెప్పానని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్, లాల్‌బహదూర్ శాస్త్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి నేతలు దేశం కోసం బతికారు తప్ప తమ కుటుంబాల కోసం సంపాదించుకోలేదన్నారు. రాజకీయాల్ని పవిత్ర వ్యాసంగంగా ఆనాటి నేతలు అందించిన విలువల్ని తిరిగి ప్రతిష్ఠించి నేతలు, వాళ్ల పిల్లల చుట్టూకాకుండా ప్రజల చుట్టూ తిరిగే కొత్త రాజకీయాన్ని తిరిగి యువత తీసుకురావాలన్నారు. యువతీయువకులు తమ జీవితాల్ని హాయిగా గడుపుతూనే సమాజాన్ని చైతన్యం చేసేందుకు ముందుకు రావాలన్నారు. "అవినీతిపరులైన రాజకీయనాయకుల్ని ఓడించటమే లక్ష్యంగా పనిచేయాలి. ఓట్లు కొనకుండా, మద్యం పంచకుండా కులానికి, మతానికి దూరంగా కొత్త రాజకీయానికి శ్రీకారం చుట్టినప్పుడే సమాజం అభివృద్ధి దిశగా వెళ్తుంది. తొలి ఓటరుగా నమోదవటంతోపాటు ఖచ్చితంగా ఓటు వేసే సంప్రదాయాన్ని యువత అలవర్చుకోవాలి. ఈదేశం బాగుపడదు అనే నిరాశను వీడి యువత ముందకొచ్చి బాధ్యత తీసుకోవాలి. నా ఓటు మీదే నా కుటుంబం, నా భవిష్యత్తు ఆధారపడిఉందని అందరూ గుర్తించి నిజాయతీపరులను ఎన్నుకోవాలి" అన్నారు. అవగాహన, చైతన్యంతో యువత కొత్త రాజకీయంలో పాలుపంచుకోవాలన్నారు.

అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తున్న లోక్‌సత్తా దేశవ్యాప్తంగా విప్లవాత్మక చట్టాలు తెచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. సమాచార హక్కు చట్టం తేవటంలో, గ్రామస్థాయి న్యాయాలయాలు ఏర్పాటులో, జాతీయ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు ప్రయత్నంలో లోక్‌సత్తా పాత్ర కీలకమన్నారు. ఉద్వేగాలు, హింసను పెంచి పోషిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న రాజకీయ నాయకుల కుట్రను యువత అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రం విడిపోయినా ఉపద్రవమేమీ రాదని, కొత్త రాష్ట్రం వచ్చినా అద్భుతాలేవీ జరగవని స్పష్టంచేశారు. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకునేందుకే తెలంగాణ, సమైక్యాంధ్ర అంటూ ప్రజల మధ్య అగాధాలు సృష్టిస్తున్నారన్నారు.

స్టూడెంట్స్ ఫర్ నేషన్ బిల్డింగ్, యువసత్తా, విద్యార్థిసత్తా, లోక్‌సత్తా ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద జేపీ ప్రారంభించారు. ర్యాలీ అంబేద్కర్ ఆడిటోరియం వరకూ సాగిన ర్యాలీలో కలిసినడిచారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి, గాంధీ చిత్రపటానికి జేపీ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కొత్తకోట పోలినాయుడు, అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా॥ కె. రవికుమార్, లోక్‌సత్తా నేతలు పంచాది రాంబాబు, బి. జగదీష్, శివాజీ, గౌరీశంకర్, యువసత్తా జిల్లా అధ్యక్షుడు బుడుమూరు సన్యాసిరావు, పెద్దసంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. ◆

# యువతలో ఆదర్శం, ఆవేశం పొంగిపొర్లాలి

## విజయనగరం విద్యార్థులతో డా॥ జయప్రకాష్ నారాయణ్

యువతతో విజయనగరంలోనూ జేపీ సమావేశమయ్యారు. 'యువతా మేలుకో... అవినీతిని అడ్డుకో' పేరుతో స్పార్క్, యాక్ట్, వైబీఐ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జేపీ మాట్లాడుతూ...ప్రపంచ దేశాల్లో భారతదేశానికున్న ప్రతిష్టను నిలపటం, రాబోయే కాలంలో భారత్‌ను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దటం కోసం యువతలో ఆదర్శం, ఆవేశం పొంగిపొర్లాలని పిలుపునిచ్చారు. అవినీతిని అంతం చేసేందుకు అందరూ కదలాలని, అవినీతిపై పోరాడే వారిలో దేశం పట్ల భక్తి, గౌరవం ఉండాలన్నారు. భాష్యం విద్యాసంస్థ విద్యార్థులు ప్రదర్శించిన 'ఓటుకు నోటు... ఇందిరమ్మ ఇంటి పేరు కాదురా గాంధీ..' తదితర పాటలు, లంచం తీసుకుంటే వచ్చే అనర్థాలను వివరిస్తూ ప్రదర్శించిన దృశ్యమాలిక ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సివిల్స్ ర్యాంకర్ అజయ్‌జైన్, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎం.వి గణేష్, సంఘసేవకులు పి.వి నరసింహరాజు, యాక్ట్ కన్వీనర్ యు.ఎ నరసింహం, స్పార్క్ అధ్యక్షులు పి. భవానీ, వై.బి.ఐ రాష్ట్ర సమన్వయకర్త డి. నరసింహం, మేకా కాశీవిశ్వేశ్వరరావు, ఎస్.సి.హెచ్. వెంకటరమణ, ఎం. ఆర్ మహిళాకళాశాల ప్రిన్సిపల్ ఎం. రాజ్యలక్ష్మి, లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విధానాలే అన్నదాతకు శాపాలు

## చిత్తూరు

### రైతులను నట్టేట ముంచుతున్న సీఎం

చిత్తూరు జిల్లాలో రైతులు అనేక కష్టాలతో సహజీవనం చేస్తున్నారన్నారు. ఇటీవల జిల్లా పర్యటనలో రైతులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి కంటి తుడుపు మాటలు చెప్పారని చిత్తూరులోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో డా॥ జయప్రకాష్ నారాయణ్ విలేకరులతో అన్నారు. జిల్లాలోని చెరుకు రైతులు గిట్టుబాటు ధర లేక నష్టాలను భరిస్తున్నారని, సహకార చక్కెర కర్మాగారాలను ఆదుకోవలసిన ముఖ్యమంత్రి వాటిని అమ్మడానికి, రైతులను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చెరుకు గిట్టుబాటు ధరను రాష్ట్ర ప్రభుత్వం ఇష్ట ప్రకారం పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోవడం లేదని రైతులకు 300 వరకు నష్టం వస్తోందన్నారు. 25 ఏళ్ల క్రితం రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్న చిత్తూరు డెయిరీ స్వార్థపరుల రాజకీయానికి బలై మూత పడిందన్నారు. దీంతో జిల్లా పాడిరైతులు ప్రయివేటు డెయిరీలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. పాత డెయిరీని తెరవలేకపోతే, కొత్త డెయిరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జయకుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### రైతుల్ని ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కౌలుదారుల చట్టాన్నీ అమలు చేయలేక పోతోంది.

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం బెలమాం, పొందూరు మండలం కింతలిలో రైతులనుద్దేశించి జేపీ మాట్లాడుతూ... రైతులను ఆదుకోవటంలో రాష్ట్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో 1.20 కోట్లమంది రైతులుండగా సుమారు 60లక్షలమంది కౌలురైతులున్నారని, కౌలురైతుల చట్టాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలుచేయలేకపోతోందని అన్నారు. పరిశ్రమలకు రాయితీలు కల్పించి పెత్తందారులకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయన్నారు. చెమటోడ్చి ఆరుగాలం కష్టపడి పండించిన రైతు పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవటంతో అన్నదాతలకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఉపాధి పథకం పేరుతో అవసరంలేని పనుల కోసం రాష్ట్రంలో ఏడు వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇందులో 10శాతం నిధులను వ్యవసాయ మార్కెట్ కమిటీలకు మళ్లిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పత్తి, మిర్చి పంటలను ఇతర దేశాలకు ఎగుమతులు నిషేధించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ పరిస్థితిని మార్చి వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని, మిగులు ఆహారధాన్యాలను, ఆహారేతర పంటలను ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ అమ్ముకునేలా శాశ్వత ప్రాతిపదికన స్వేచ్ఛావాణిజ్య విధానాన్ని అమలుచేయాలని, జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. కింతలి రైతు సదస్సులో పెద్దఎత్తున తరలివచ్చిన రైతులు జేపీతో మాట్లాడటానికి పోటీ పడ్డారు.

## రాయదుర్గం

### ప్రభుత్వ విధానాలే అన్నదాతకు శాపాలు

రైతులు సంఘటితమై ప్రభుత్వ మెడలు వంచితేగిట్టుబాటు ధర వస్తుందని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అన్నం పెట్టే రైతన్నను ప్రభుత్వాలు భిక్షగాళ్లుగా మార్చాలని చూస్తున్నాయన్నారు. అనంతపురం రాయదుర్గంలో విలేకరులతో మాట్లాడారు. డీ.హీరేహాళ్ మండలం గొడిశలపల్లిలో రైతులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. గొడిశలపల్లిలో లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం నియోజకవర్గ నాయకులు బాబు అధ్యక్షతన నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు 1.80 కోట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 9 లక్షల మంది ఉన్నారన్నారు. ఉద్యోగుల సమైక్యంగా ఉండడంతో వారి డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటున్నారన్నారు. రైతులు కూడా సమైక్యంగా ఉండాలన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చకపోతే ఆర్థిక

వ్యవస్థ కుప్పకూలుతుందన్నారు. ప్రస్తుతం గ్రామల్లోని రైతులకు అవగాహన కల్పించడం కోసం లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా 50 వేల మంది రైతులకు శిక్షణ ఇస్తామన్నారు. మార్కెట్ సౌకర్యం లేక రైతులు నష్టపోతున్నారని రైతులు ఇప్పటికైనా సంఘాలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. దానిమ్మ, పత్తి, వేరుశనగ రైతులు జయరామిరెడ్డి, గంగిరెడ్డిలతో సాగు, మార్కెటింగ్ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు సోకకపోతే ఎకరాకు రూ॥లక్ష వరకు ఆదాయం వస్తుందన్నారు. 3 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. వర్షాధారం కింద వేరుశనగ సాగు చేస్తున్నామని, ఎకరాకు 12 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. పంట పెడితే పెట్టుబడి తప్ప లాభం రాదని వేరుశనగ రైతులు చిక్కన, మల్లారెడ్డి జేపీ దృష్టికి తీసుకెళ్లారు.

సమావేశంలో రైతుసంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర, లోక్‌సత్తా జిల్లా నాయకులు ఓంకార్, శ్రీధర్, రాయలకొండయ్య, వన్నూరప్ప, మహిళాసంఘం అధ్యక్షురాలు సరస్వతి, రాయదుర్గం తాలూకా నాయకుడు బాబూ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం ముందు లోక్‌సత్తా ధర్నా

**రాయదుర్గం :** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సబ్సిడీతో సరఫరా చేస్తున్న నిత్యవసర వస్తువుల పంపిణీ అస్తవ్యస్థంగా మారి అర్హులకు సక్రమంగా అందడంలేదని ఈ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాయదుర్గం లోక్‌సత్తా పార్టీ ఆరోపించింది. ఈ మేరకు స్థానిక తాలూక అధ్యక్షులు బాబు, కార్యదర్శి అబ్దుల్లా, రియాజ్, నాగరాజురెడ్డి, లోకేష్ తదితరుల అధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు నెలలుగా పామాయిల్ సరఫరా చేయకుండా కోత విధించి సామాన్య నిరుపేదలకు తీరని భారం మోపారని ఆరోపించారు. అనంతరం స్థానిక డిప్యూటి తహశీల్దారు ఆంజనేయులకు వినతి పత్రం అందించారు.

# చిలకలూరిపేటలో లోక్‌సత్తా కార్యకలాపాలు



## ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దాం

**చిలకలూరిపేట :** ముంబాయి ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా లోక్‌సత్తా పార్టీ, మోడరన్ కళాశాల విద్యార్థులు కలిపి కేబీరోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రమం వద్ద కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ దేశంలో నెలకొన్న అవినీతిని, లంచగొండి తనాన్ని ఆసరా చేసుకొని ఉగ్రవాదులు దేశంలోకి చొరబడుతున్నారని విమర్శించారు. ఉగ్రవాదదాడులలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు అబ్దుల్ జబ్బార్, మురికిపూడి ప్రసాద్, ప్రవీణ్, గౌస్, చంటి జానీ, సిద్దిక్, వెంకటేశ్వరరావు, విద్యార్థి నాయకులు పులుగుర్జు మహేష్, బొంతా బ్రహ్మయ్య, సాయిరాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

**చిలకలూరిపేట :** 10వ వార్డులోని విద్యుత్ సమస్యలపై విద్యుత్‌శాఖ అధికారులను లోక్‌సత్తా నాయకులు స్థానికప్రజలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతిరోజు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, కక్కెర దాసయ్య కంపెనీ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫారంతో ఇబ్బందులు పడుతున్నామని వారి దృష్టికి తీసుకొచ్చారు. కాలనీల చుట్టూ విద్యుత్ తీసుకొచ్చారు. కాలనీల చుట్టూ విద్యుత్ వైర్లు ప్రమాదకర స్థాయిలో కిందకు జారాయని వాటిని సరిచేయాలని కోరారు. సమస్యపై స్పందించిన అధికారులు రెండు రోజులలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు మాదాసు భానుప్రసాద్, మురికిపూడి ప్రసాద్, ఆశోక్‌లతో పాటు 10వ వార్డు వెంగళరెడ్డి నగర్‌కు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి అభివృద్ధి కార్యక్రమాలు

**ఒకపైసా కూడా అవినీతి పాలు కాకుండా చూడండి - జేపీ**

ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ , మేయర్ బండ కార్తీక రెడ్డి మరియు కార్పొరేటర్ ముద్దం నర్సింహా రావు ఓల్డ్ బోయిన్‌పల్లిలోని సమతానగర్, మణికంఠ కాలనీ, భవానీ నగర్‌లో 98 లక్షల పనులను ప్రారంభించారు. మొదటగా సమతా నగర్‌లోని 48.4 లక్షల పనులను ప్రారంభించి, స్థానిక ప్రజలే ఒక్కపైసా కూడా అవినీతి పాలు కాకుండా చూడాలని అన్నారు.

**ప్రతి పని దగ్గర సమాచారాన్ని ఉంచండి - జేపీ**

ఈ రోజు డా॥ జేపీ కె.పి.హెచ్.బి. డివిజన్‌లోని రోడ్డు నెం. 1 లో ఆశా డెంటల్ కేర్‌ను ప్రారంభించారు. తర్వాత జేపీ కె.పిహెచ్.బి లోని మూడవ ఫేజ్‌లోని హెచ్.ఐ.జి 182 దగ్గర 8.2 లక్షల జి.హెచ్.ఎమ్.సి సిసి రోడ్డు పనులను, కె.పి.హెచ్.బిలోని మూడవ ఫేజ్‌లో 8.45 లక్షల సిసి రోడ్డు పనులను తొమ్మిదవ ఫేజ్‌లోని ఎమ్.ఐ.జిలో, 15.3 లక్షల సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. తర్వాత భగత్‌సింగ్ నగర్‌లో 6.33 లక్షల సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రతి పని దగ్గర జేపీ చుట్టుప్రక్కల ఉన్న స్థానికులతో కొబ్బరికాయలు కొట్టించడమే కాకుండా వారు ఆ పనిని దగ్గరుండి అవినీతి జరగకుండా చూడాలని అన్నారు. ప్రతి పని జరిగే దగ్గర గోడపైన పెయింట్‌తో ఆ పనికి సంబంధించి ఎస్టిమేట్ వివరాలు ఎన్ని రోజులలో ఆ పనులను పూర్తి చేయాలో అనే సమాచారాన్ని ఉంచాలని డా॥ జయప్రకాష్ నారాయణ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.సి. రవి రవికిరణ్, ఈ.ఈ రమేష్ గుప్త, డి.ఈ శ్రీధర్, ఏ.ఈ. సాంబయ్యలు పాల్గొన్నారు. లోక్‌సత్తా నేతలు ఎల్.వి. రామరాజు, శ్రీనివాసన్, బొంతు సాంబిరెడ్డి, ఉపేందర్ రెడ్డి, బాదినేని ప్రసాద్, సత్యనారాయణ, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, రామక్రిష్ణ, సుశీల్, పవన్, సురేష్, వార్డ్ కమిటీ మెంబర్లు, స్థానిక అసోసియేషన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

**దళారుల భరతం పట్టిన లోక్‌సత్తా**

ఈరోజు ఎమ్మార్వో ఆఫీసులో దళారులు 300 నుండి 500 ల వరకు డబ్బు తీసుకొని ధృవీకరణ పత్రాలు ఇస్తున్నారని విద్యార్థులు చేసిన ఫిర్యాదు మేరకు లోక్‌సత్తా పార్టీ నేతలు స్టాంప్ వెన్డర్ ఆఫీసర్ దగ్గరకు వెళ్ళి అతను డబ్బులు తీసుకుంటుండగా ఫొటోలు మరియు వీడియో రికార్డ్ చేసి, ఆ తర్వాత దాని డిప్యూటీ తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళగా, అతను వెంటనే డబ్బులు తిరిగి ఇప్పించి కఠినచర్యలు తీసుకుంటామని వెన్డర్‌ను హెచ్చరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అవినీతికి ఖచ్చితమైన ఆధారాలు ఉంటే 40150139 నెంబర్ ఫోన్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు బొంతు సాంబిరెడ్డి, వి.సత్యనారాయణ, వెలగా శ్రీనివాస్, క్రిష్ణారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**సక్రమంగా అమలు కాని సమాచార హక్కు**

లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఈ రోజు ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలును పరిశీలించడమే కాకుండా దాని గురించి అధికారులకు తెలియజేసి, దానిని అమలుపర్చమని వినతిపత్రాలను ఇచ్చారు. ఆ కార్యక్రమంలో మొదటగా ఎమ్.ఆర్.ఓ. ఆఫీస్‌లో పరిశీలించగా అక్కడ రికార్డ్స్ ఎక్కడ ఉన్నాయో సూచించే వరుస పట్టిక లేకపోవడం, మాన్యువల్ లేకపోవడం, తర్వాత కూకట్‌పల్లిలోని కె.పి.హెచ్.బిలో ఉన్న ఎలక్ట్రిసిటి ఆఫీస్, వాటర్ బోర్డ్ ఆఫీస్‌ను సందర్శించి చట్టం 4(1)బి వివరాల జాడ కన్పించక పోవడం గమనించారు. తర్వాత ఆర్.టి.ఏ. ఆఫీస్‌ను సందర్శించి అక్కడ కూడా 4(1) అమలు కాకపోగా ఉన్న సిటిజన్స్ ఛార్టర్ పై వేరే పేపర్లు అంటించడం గమనించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు వి. సత్యనారాయణ, వెలగా శ్రీనివాస్, క్రిష్ణారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**యువతకు ఉపాధి**

లోక్‌సత్తా పారీ ఆధ్వర్యంలో ఎయిర్ కొరకు జూలై 26న నిర్వహించిన ఇంటర్వ్యూకు 62 మంది హాజరుకాగా, వీరిలో 6గురిని ఎంపిక చేశారు.

లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో రుసిర ఐ.టి. సొల్యూషన్స్ కొరకు ఇంటర్వ్యూకు 72 మంది హాజరుకాగా వీరిలో 10 మందిని ఎంపిక చేసినట్లు లోక్‌సత్తా నేత బొంతు సాంబిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ◆

# రాష్ట్రంలో విద్యార్థి సత్తా కార్యక్రమాలు




ముంబాయి పేలుళ్ల ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు లోక్‌సత్తా, సీపీఐ, తెలుగుదేశం పార్టీలు సంతాపం వ్యక్తం చేశాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే దేశంలో ఉగ్రవాదుల దాడులు నానాటికీ పెరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఫ్లోర్ లీడర్ ఎ.జె.స్టాలిన్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చలసాని రాఘవేంద్రరావు, నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సహాయ కార్యదర్శి కె.సత్యాంజనేయ పాల్గొన్నారు. లోక్‌సత్తా పార్టీ నుంచి స్టూడెంట్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు పి. శివాజీరాజు, జిల్లా ఇన్‌చార్జ్ ప్రసాద్, రాంశశిధర్, శర్మ దివ్య, ఉమా, రమ్య పాల్గొన్నారు. టీడీపీ ఆందోళనలో ఆ పార్టీ దక్షణ నియోజక వర్గం ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్, జీవీఎంపీ ఫ్లోర్ లీడర్ పైల ముత్యాలనాయుడు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం

ప్రజా సంక్షేమాన్ని, పరిపాలనను గాలికొదిలేసి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా ప్రతినిధులు బాధ్యతలు విస్మరిస్తూ రాష్ట్రంలో సంక్షోభాన్ని సృష్టిస్తున్నారని విద్యార్థి సత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి.శివాజీ రాజు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువసత్తా రాష్ట్ర కార్యదర్శి పంచాది రాంబాబు, అప్పలరాజు, సంతోష్‌కుమార్, బి.గౌరీశంకర్, పి.నాయుడు పాల్గొన్నారు.

## నెల్లూరు

లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలకు దేశం మొత్తానికి ఒకే చట్టం ఉండాలని ఈ నెల 25వ తేదీ నుంచి విద్యార్థి సత్తా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేయనున్నట్లు విద్యార్థి సత్తా రాష్ట్ర అధ్యక్షుడు పి.శివాజిరాజు తెలిపారు. స్థానిక లోక్‌సత్తా కార్యాలయంలో విద్యార్థి సత్తా జిల్లా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిసత్తా జిల్లా అధ్యక్షుడు హరికేశవ్, నెల్లూరు నగర, కావలి అధ్యక్షులు చంద్రశేఖర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కడప

అవినీతికి వ్యతిరేకంగా లోక్‌పాల్‌తో పాటు లోకాయుక్తను కలిపి దేశమంతా ఒకే చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ 'పీపుల్స్' అగైనెస్ట్ కరప్షన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలి నుంచి ఏడురోడ్ల సర్కిల్ వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా శివాజీరాజా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆ రెండింటినీ కలిపేలా చట్టం చేయడంతోపాటు వాటికి విశేష అధికారాలు కల్పించినపుడే దేశంలో అవినీతికి అడ్డుకట్ట పడుతుందన్నారు. రాయలసీమ రీజినల్ కో-ఆర్డినేటర్ మారెంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కార్యక్రమంలో విద్యార్థిసత్తా జిల్లా అధ్యక్షుడు నవీన్, పీఏసీ నాయకులు సుమంత్, మౌలాలి మహేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్

### బలమైన 'లోక్‌పాల్' కోసమే ప్రజా ఉద్యమం

ఒకే చట్టం ద్వారా దేశానికి లోక్‌పాల్, రాష్ట్రానికి లోకాయుక్తలు, స్థానిక ప్రభుత్వాలకు అంబుడ్స్‌మన్‌లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట నియోజక వర్గ పరిధిలో పదివేలకుపైగా సంతకాలు సేకరిస్తామని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. రామచంద్రారెడ్డి మండల కేంద్రాల్లో కూడా విరివిగా సంతకాల సేకరణ చేపడతామని చెప్పారు. సమావేశంలో యువసత్తా నియోజకవర్గ కన్వీనర్ దేశెట్టి రాజు, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ప్రతినిధులు యాదగిరి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ◆





శ్రీకాకుళంలో లోక్‌పాల్ బిల్లు కోసం జేపీతో విద్యార్థుల ర్యాలీ



చిత్తూరులో లోక్‌పాల్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న జేపీ



విజయనగరం లో లోక్‌పాల్ బిల్లును విద్యార్థులకు వివరిస్తున్న జేపీ



కడపలో లోకాయుక్త కోసం విద్యార్థిసత్తా మానవహారం



విజయనగరంలో ఐ.ఎమ్.ఏ 53వ వార్షికోత్సవ సభలో జేపీ



విజయనగరం మున్సిపల్ శంఖారావం సభలో మాట్లాడుతున్న
రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డి.వి.వి.యస్. వర్మ



విజయనగరం మున్సిపల్ శంఖారావం సభలో మాట్లాడుతున్న
జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



అవినీతి అంతానికి, దేశానికి లోక్‌పాల్, రాష్ట్రాలకు లోకాయుక్త,
జిల్లాలకు అంబుడ్స్‌మన్‌ల ఏర్పాటు చెయ్యాలి

విజయవాడలోని మహిళా కళాశాల విద్యార్థులతో డా॥ జేపీ

RNI.Reg. No. APTEL/2010/32219
Postal Reg. No. HD/1126/2010-12

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad